ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 21.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 241 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu



గోల్డ్.. కొట్టిన నిఖత్ జరీన్ 12



డిసెంబర్ 11, 14, 17

'పంచాయతీ'కి సర్కారు రెడీ!!

ఈ నెల 26 లేదా 27వ తేదీన షెడ్యూల్

రాష్ట్రమంతా మూడు దశలుగా ఎన్నికలు

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం ఆమె హైదరాబాద్ నుండి సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ,శాంతిభద్రతల అంశాలను సమీక్షించారు. ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

- ఇప్పటికే ఓటరు జాబితా షెడ్యూల్ విడుదల
- తీవ్ర కసరత్తు చేస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం
- కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్
- ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి
- అవకతవకలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి
- నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలి
- చట్ట ప్రకారమే ఆయా వర్గాలకు రిజర్వేషన్లుంటాయి
- సమీక్ష సమావేశంలో ఎస్ఈసీ రాణి కుముదిని

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 20: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. ఈ నెల 26 లేదా 27వ తేదీన పంచాయతీ ఎన్నికల నగారా మోగనుందని తెలుస్తోంది. మొత్తం మూడు దశలలో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. డిసెంబర్ 11, 14, 17 తేదీలలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ ఎన్నికలను చాలా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లకు ఎస్ఈసీ స్పష్టం చేసింది. పంచాయతీలలో ఓటరు జాబితా మరోసారి సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం నుంచి 23వ తేదీ వరకు గ్రామాలలో ఓటర్ల జాబితాలను

..:: మిగతా 2లో

ఈ కార్ రేసింగ్ కేసు

కీలక మలుపు

కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ ఓకే

- మరోసారి విచారణ జరుపనున్న ఏసీబీ
- చార్జిషీట్ వేయడానికి అధికారులు సిద్ధం
- రూ.54.88 కోట్లు దారి మళ్లాయని ఆరోపణ
- 2022 అక్టోబరు 25న ఈ రేసుకు ఒప్పందం
- తదుపరి సీజన్ నుంచి తప్పకున్న ఏస్ నెక్స్ట్ జెన్
- ఆ తర్వాత హెచ్ఎండీఏకు బాధ్యతల అప్పగింత
- ఇక్కడి నుంచే మొదలైన అసలు వివాదం
- సర్కారు తీరుపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 20: ఈ కార్ రేసింగ్ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఎట్టకేలకు అనుమతించారు. దీంతో ఏసీబీ విచారణకు మరో అవకాశం లభించింది. ఇప్పటికే ఫార్ములా ఈకార్ రేసింగ్‌లో నాలుగు సార్లు ఏసీబీ విచారణకు కేటీఆర్ హాజరయ్యారు. రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం కేసులో ఏసీబీ విచారణ జరుపుతోంది. ఈ కేసులో కేటీఆర్ పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలంటూ గవర్నర్‌ను అనుమతి కోరింది. ఈ మేరకు గతంలోనే ఏసీబీ లేఖ రాసింది. దానిని పరిశీలించిన గవర్నర్ తాజాగా కేటీఆర్ విచారణకు అనుమతి జారీ చేశారు. ఏసీబీ త్వరలోనే ఛార్జిషీట్ దాఖలు చేయనుంది. ఫార్ములా ఈకార్ రేసింగ్‌పై 2022 అక్టోబరు 25న ఒప్పందం కుదిరింది. ఫార్ములాఈ ఆపరేషన్స్, ఏస్ నెక్స్ట్ జెన్, పురపాలక శాఖలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. 9, 10, 11, 12వ సీజన్ల కార్ రేస్‌లు హైదరాబాద్‌లో నిర్వహించేలా ఒప్పందం కుదిరింది. 2023 ఫిబ్రవరి 10, 11 తేదీలలో నెక్లెస్‌రోడ్‌లో తొమ్మిదో సీజన్ రేసింగ్ నిర్వహించారు. తదుపరి యేడాది 10 వ సీజన్ నుంచి ఏస్ నెక్స్ట్‌జెన్ అకస్మాత్తుగా తప్పుకుంది. దాంతో ప్రమోటర్‌గా హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెట్ అథారిటీ (హెచ్ఎండీఏ)నే

..:: మిగతా 2లో



బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ ప్రమాణం

జనతాదళ్ (యు) అధినేత నితీశ్ కుమార్ బిహార్ ముఖ్యమంత్రిగా గురువారం పదో సారి ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు.

11



అనిల్ అంబానీ ఆస్తులు 1400 కోట్లు సీజ్

కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ అనిల్ అంబానీకి చెందిన కంపెనీలపై భారీ చర్యలు తీసుకుంది. తాత్కాలిక అటాచ్‌మెంట్ ఆర్డర్ కింద దాదాపు 1400 కోట్ల రూపాయల విలువైన స్థిర ఆస్తులను స్వాధీనం చేసుకుంది.

11

రాష్ట్రపతి, గవర్నర్‌కు గడువు విధించలేం



- రాజ్యాంగపరంగా అది కుదిరే పని కాదు
- బిల్లులు పెండింగ్ లో ఉండడం మంచిది కాదు
- సుదీర్ఘకాలం ఆమోదించకపోతే న్యాయ సమీక్ష తప్పదు
- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 20: బిల్లుల పెండింగ్ కు సంబంధించి గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించే విషయంలో గురువారం సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆర్టికల్ 143 కింద పంపించిన ప్రశ్నలకు సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం సమాధానం ఇచ్చింది. రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి కోర్టు గడువు విధించడం రాజ్యాంగపరంగా సరిపోదని స్పష్టం చేసింది. కానీ, గవర్నర్లు ఎలాంటి కారణం చెప్పకుండా బిల్లులను వెనక్కి పంపడం సరికాదని స్పష్టం చేసింది. 'బిల్లు గవర్నర్ దగ్గరకు వచ్చినప్పుడు, బిల్లుకు సమ్మతి తెలపడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా దానిని రాష్ట్రపతికి పంపడం అనే మూడు అవకాశాలు ఉంటాయని ధర్మాసనం గుర్తు చేసింది. ఈ మూడింటిలో దేనిని ఎంచుకోవాలో నిర్ణయించడం గవర్నర్ విచక్షణాధికారమని, ఈ వ్యవహారంలో కోర్టు గడువు పెట్టడం సరైంది కాదని కూడా ధర్మాసనం పేర్కొంది. గవర్నర్ల విధులు, నిర్ణయాలలో కోర్టులు సాధారణంగా జోక్యం చేసుకోలేవని, కానీ, కారణం లేకుండా బిల్లులను దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచితే మాత్రం అది న్యాయపర సమీక్ష పరిధిలోకి వస్తుందని పేర్కొంది. రాష్ట్రపతికి కూడా ఇదే నిబంధన వర్తిస్తుందని, గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపిన ప్రతిసారి సుప్రీంకోర్టును సంప్రదించాల్సిన అవసరం లేదని వివరించింది. ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ఎప్పుడైతే అవసరం అనుకుంటారో అప్పుడే అభిప్రాయం కోరవచ్చని

..:: మిగతా 2లో



హిడ్మా, రాజే అంత్యక్రియలు

- ఒకే చితిపై ఇద్దరి దహన సంస్కారం
- కడసారి చూపునకు వచ్చిన జనం
- నల్ల బట్టలతో హిడ్మాకు తుది వీడ్కోలు
- ఎరుపు రంగు బట్టలతో రాజేకు నివాళి
- ఎన్ కౌంటర్ పై బంధువుల అనుమానాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

రాయపుర (ఛత్తీస్ గఢ్), నవంబర్ 20: పోలీసుల ఎదురుకాల్పులలో చనిపోయిన మావోయిస్టు అగ్రనేత మాడ్వి హిడ్మా (43), ఆయన సతీమణి మద్దం రాజేకు వారి పూర్వీకుల గ్రామం ఛత్తీస్‌గఢ్‌లోని పూర్వర్తిలో గురువారం సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు జరిగాయి. వారిని కడసారి చూసేందుకు పూర్వర్తి, జబగట్ట, బాటుం, టేకల్ గూడెం, మినట్ట గ్రామాల ప్రజలు, కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు భారీగా తరలివచ్చారు. నలుపు దుస్తులలో హిడ్మాకు, ఎరుపు సారీలో రాజేకు తుది వీడ్కోలు పలికారు. హిడ్మా, రాజే భౌతిక కాయాలకు ఒకే చితిపై దహన సంస్కారాలను నిర్వహించారు. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ఈ నెల 18న జరిగిన ఎన్‌కౌంటర్ లో మాడ్వి హిడ్మా, ఆయన సతీమణి మద్దం రాజే అలియాస్ రాజక్క, మరో నలుగురు మావోయిస్టులు

..:: మిగతా 2లో



మళ్లీ నిరసనలతో మండుతున్న బంగ్లాదేశ్

తాజాగా మళ్లీ బంగ్లాదేశ్ మండుతోంది. మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ) విధించిన మరణశిక్ష దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ ప్రకంపనలు రేపింది.

11

తెలంగాణ–ఈశాన్య మధ్య బంధాలు బలోపేతం




- ఫ్యూచర్ సిటీలో 'నార్త్ ఈస్ట్' అనుబంధ కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది
- నిరంతర సహకారం, పరస్పర అవగాహన అవసరం
- తెలంగాణ-ఈశాన్య రాష్ట్రాల ఉత్సవాలలో సీఎం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 20: తెలంగాణ–ఈశాన్య రాష్ట్రాల మధ్య సంబంధాలను మరింత పటిష్టపరుచుకోవడానికి భారత్ ఫ్యూచర్ సిటీలో నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఉచితంగా కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ అనుబంధ కేంద్రంలో ప్రతి ఈశాన్య రాష్ట్రం తన సొంత భవనాన్ని నిర్మించుకోవడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. తెలంగాణ ఈశాన్య రాష్ట్రాల మధ్య కళలు, సంస్కృతి, సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఆవిష్కరణల వంటి అంశాలలో నిరంతర సహకారం, పరస్పర అవగాహన కోసం

..:: మిగతా 2లో



సింగరేణికి 'నీతి ఆయోగ్'లో చోటు

- కీలక ఖనిజ రంగంలో చొరవకు గుర్తింపు
- ఇది తెలంగాణకు, సంస్థకు గొప్ప విషయం
- మన రాష్ట్రం దేశవ్యాప్త గుర్తిపు పొందుతోంది
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 20: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఖనిజ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మిగిలిన అన్ని రాష్ట్రాల కన్నా ముందుండి దేశవ్యాప్త గుర్తింపును పొందుతోందని చెప్పారు. ఇటీవల నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి కీలక ఖనిజ కమిటీలో రాష్ట్రప్రభుత్వ సంస్థ అయిన సింగరేణికి ప్రముఖ స్థానం కల్పించడం దీనికి నిదర్శనమని వివరించారు. ఈనెల 19వ తేదీన నీతి ఆయోగ్ ప్రకటించిన జాతీయ స్థాయి కీలక ఖనిజాల గుర్తింపు, అన్వేషణ కమిటీలో సింగరేణి సీఎండీని సభ్యుడిగా నియమించారు. ఈ నేపథ్యంలో భట్టి విక్రమార్క గురువారం ఈ ప్రకటన చేశారు. ఇప్పటికే ఆస్ట్రేలియా, రష్యా, ఘనా వంటి దేశాలతో వ్యాపార విస్తరణ అవకాశాలపై చర్చలు

..:: మిగతా 2లో



ఎన్ఐఏ కస్టడీలో ముగ్గురు వైద్యులు, మత బోధకుడు

ఎర్రకోట వెలుపల జరిగిన ఘోర కారు పేలుడు ఘటనతో దగ్గరి సంబంధం ఉందని గుర్తించిన ఎన్ఐఏ ముగ్గురు వైద్యులు, ఒక మత బోధకుడిని గురువారం కస్టడీలోకి తీసుకుంది.

11

రాష్ట్రీయం



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- **నాబార్డ్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తోంది**
- **ఎర్త్ సమ్మిట్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ధృఢ సంకల్పంతో ముందుకెళ్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఆయన మాదాపూర్ లోని హైటెక్స్ లో ఏర్పాటుచేసిన నాబార్డ్ మొదటి ఎర్త్ సమ్మిట్ లో ప్రసంగించారు. దేశంలోనే అతి పెద్ద రుణమాఫీలలో ఒకదాన్ని అమలు చేసి, దాదాపు 22 లక్షల కుటుంబాలకు 21వేల కోట్ల రూపాయల ఉపశమనం అందించామన్నారు. కొనుగోలు వ్యవస్థను విస్తరించి పారదర్శకంగా మార్చామన్నారు రైతులకు నేరుగా, సమయానుసారం మద్దతు అందుకునేలా రైతు భరోసా అమలు చేస్తున్నామని వివరించారు. సాగునీరు, డిజిటల్ పంట రికార్డులు, కోత తర్వాతి మౌలిక వసతులలో పెట్టుబడులతో గ్రామీణ కుటుంబాలలో బలమైన నమ్మకాన్ని పునరుద్ధరించామని తెలిపారు. నాబార్డ్ ఆధ్వర్యంలో ప్రథమ ఎర్త్ సమ్మిట్ హైదరాబాద్‌లో ప్రారంభం కావడం చాలా సముచితంగా ఉందన్నారు. నాబార్డ్ ఎప్పుడూ ప్రచారం కోసం పోరాడిన సంస్థ కాదు కానీ, నాబార్డ్ లేకపోతే గ్రామీణ భారతం ఇవాళ ఇలా ఉండేది కాదన్నారు. పీఏసీఎస్‌ల ఆధునీకీకరణ, సహకార సంస్థల బలోపేతం, వ్యవసాయ డిజిటలైజేషన్, ఎఫ్పీఓలకు సుస్థిర శక్తి ఇవ్వడం గ్రామీణ భారత పునరుద్ధరణ వెనుక ఉన్న నిశ్శబ్ద శక్తి నాబార్డ్ అని డిప్యూటీ సీఎం అభివర్ణించారు. కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నాబార్డ్ చైర్మన్ షాజీ, నాబార్డ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గోవర్ధన్ సింగ్ రావత్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి సమస్యలపై సీఎం స్పందించాలి

- **100 పడకల ఆసుపత్రిని వినియోగంలోకి తేవాలి**
- **షాద్ నగర్ పర్యటనలో కవిత డిమాండ్**

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 20: జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం షాద్ నగర్ నియోజకవర్గంలో పర్యటించారు. కమ్యూనిటీ ఆసుపత్రిని పరిశీలించి అక్కడ నెలకొన్న సమస్యలను స్వయంగా ఆరా తీశారు. రోగులతో మాట్లాడి, విభాగాలవారీ పరిస్థితులను తెలుసుకున్నారు. ఆసుపత్రి పైకప్పులు పెచ్చులు ఊడిపోతుండటం, ప్రాథమిక సదుపాయాల కొరత, పరికరాల పనితీరు దెబ్బతినడం బాధాకరమని పేర్కొన్నారు. 28 మంది వైద్యులు ఉండాల్సిన చోట 12 మంది మాత్రమే పని చేస్తున్నారని, అయినప్పటికీ తక్కువ సిబ్బందితో రోగులకు సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిని ప్రశంసించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని ప్రాధాన్యతగా తీసుకుని వెంటనే పూర్తి చేసి ప్రజల వినియోగానికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేస్తే మాత్రమే రోగులకు నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. కేసీఆర్ కిట్‌ను నిలిపివేయడం చాలా బాధాకరమని, ఈ పథకం వేలాది గర్భిణులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేదని ఆమె గుర్తు చేశారు. ఆ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

నేడు హైదరాబాదుకు రాష్ట్రపతి ముర్ము

- **ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల పర్యటన ముగించుకుని శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆమె రాజ్ భవన్‌కు వెళ్తారు. మధ్యాహ్నం భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటారు. 3:50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకుంటారు. సాయంత్రం 4.00 గంటలకు నిర్వహించే భారతీయ కళా మహోత్సవాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 6:15 గంటలకు ఆమె తిరిగి రాజ్ భవన్‌కు చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేయనున్నారు. శనివారం ఉదయం 9:30 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి బయలుదేరి వెళ్తారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.





ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా హైదరాబాద్

- **8 వారాల పైలట్ ప్రోగ్రాం అమలుకు నిర్ణయం**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అనలాగ్ ఏఐ సీఈవో కిప్ మన్ భేటీ**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా హైదరాబాదును తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం వీలైనంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం అనలాగ్ ఏఐ సీఈఓ అలెక్స్ కిప్‌మన్ సీఎంను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను వారిద్దరు చర్చించారు. ట్రాఫిక్, అర్బన్ ఫ్లడింగ్, సరస్సుల రక్షణ, వాతావరణ అంచనా, పరిశ్రమల కాలుష్య నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించే మార్గాలను ఆరా తీశారు. 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ఆధారంగా రియల్ టైమ్ సెన్సార్ నెట్వర్క్, స్మార్ట్ సిటీ నిర్వహణ పద్ధతులను అమలు చేసే వీలుందని వారు అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా హైదరాబాద్ సిటీలో ఫిజికల్ ఇంటెలిజెన్స్ ను పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించారు. ఎనిమిది వారాలపాటు ఈ ప్రోగ్రాం అమలవుతుంది. ఇందులో భాగంగా సీసీటీవీ వ్యవస్థను రియల్ టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్‌గా మారుస్తారు. ట్రాఫిక్, ప్రజా భద్రత, అత్యవసర సేవలన్నీ ఏఐ ఆధారిత అంచనాలతో ఒకేచోట సమన్వయం చేస్తారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి లైవ్గా దీన్ని మానిటరింగ్ చేస్తారు. ఈ పైలెట్ ప్రోగ్రాం పూర్తయ్యేనాటికి హైదరాబాద్ దేశంలోనే తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా మారుతుందనే అంచనాలున్నాయి.

'పంచాయతీ'కి సర్కారు రెడీ!!

మొదటిపేజీ తరువాయి

సవరించాలని నిర్ణయించింది. 20న దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ చేయనుంది. 21న అభ్యంతరాలను పరిష్కరిస్తుంది. 23న ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజా పాలన ఉత్సవాలు జరుగుతాయి. ఆ తర్వాత ఈ ఎన్నికల నిర్వహించాలని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియపై రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. వచ్చే యేడాది మార్చి 31వ లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తేనే.. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

'స్థానిక' ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం ఆమె హైదరాబాద్ నుండి సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలను సమీక్షించారు. ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలను మూడు విడతలలో నిర్వహించేందుకు తగిన కార్యచరణ రూపొందించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, 2024 ఎస్ఈఈఈపీసీ సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

హిడ్మా, రాజే అంత్యక్రియలు

మొదటిపేజీ తరువాయి

మృతిచెందారు. హిడ్మా బాడీగార్డ్‌గా దేవే పనిచేసేవాడు. ఒకప్పుడు ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంత దండకారణ్యంపై హిడ్మాకు తిరుగులేని పట్టు ఉండేది. ఇటీవలి కాలంలో భద్రతా దళాల బలమైన దాడులతో హిడ్మా వెనుకకు తగ్గాడు. ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీ ప్రాంతాలలో మావోయిస్టు ఉద్యమం పూర్తిగా బలహీనపడింది. దీంతో మావోయిస్టులు అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్రలోని అడవులకు మకాం మార్చారు. ఈక్రమంలోనే హిడ్మా తన టీమ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ అడవులలోకి ప్రవేశించాడని అంటున్నారు.

సామాజిక కార్యకర్తల అనుమానం

కాగా, హిడ్మా ఎన్‌కౌంటర్‌పై బంధువులు, సామాజిక కార్యకర్తలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓసారి హిడ్మా, దేవే తల్లులతో కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా భేటీ అయ్యారు. ఆ తర్వాత ఆ ఇద్దరు తల్లులు ఒక కీలక ప్రకటన చేశారు. జన జీవన స్రవంతిలోకి రావాలని హిడ్మా, దేవేకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే హిడ్మా అనుచరులతో కలిసి సరెండర్ కావడానికి వచ్చాడని అంటున్నారు. అప్పుడే పోలీసులు చుట్టుముట్టి ఎన్‌కౌంటర్ చేసి ఉండొచ్చని ప్రజా సంఘాల కార్యకర్తలు చెబుతున్నారు. 'నిజానికి అటు హిడ్మాకు నాలుగంచెల భద్రత ఉండేది. దాదాపు 60 నుంచి 70 మంది మావోయిస్టులు నిత్యం పహారా కాసేవారు. అంత పటిష్ట భద్రత ఉండే హిడ్మాను చేరుకోవడం చాలా కష్టం. ఇప్పటివరకు ఎన్నడూ భద్రతా దళాలకు హిడ్మా చిక్కనే లేదు. అలాంటప్పుడు ఈ ఎన్‌కౌంటర్ ఎలా జరిగిందో అర్థం కావడం లేదు' అని హిడ్మా బంధువు లలిత్ మార్కం పేర్కొన్నారు.

రాష్ట్రపతి, గవర్నర్‌కు గడువు విధించలేం

మొదటిపేజీ తరువాయి

తెలిపింది. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణ అధికారమున్నప్పటికీ, దాన్ని అతిగా వినియోగించడం సరికాదని హెచ్చరించింది. అటు బిల్లులను తిరిగి పంపినా, ఆపినా సరైన కారణాలతో రాతపూర్వకంగా తెలియజేయాలని తెలిపింది. లేదంటే వివాదాలు తప్పవని కోర్టు అభిప్రాయపడింది.

ఈ కార్ రేసింగ్ కేసు కీలక మలుపు

మొదటిపేజీ తరువాయి

పోషించాలని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు.

ఇక్కడే మొదలైన వివాదం

ఈ నేపథ్యంలో 2023 అక్టోబరు 54.88 కోట్లను ఫార్ములాఈ ఆపరేషన్స్ సంస్థకు హెచ్ఎండీఏ నేరుగా బదిలీ చేసింది. ఈ వ్యవహారమే ఇప్పుడు ఈ మొత్తం వివాదానికి తెర లేపింది. హెచ్ఎండీఏ బోర్డు, ఆర్థికశాఖ, ఆర్బీఐ అనుమతి లేకుండానే ఈ చెల్లింపులు జరిగాయి. వీటిలోనూ రూ.46 కోట్ల వరకు డాలర్ల రూపంలో చెల్లించారనేది ప్రధాన అభియోగం. ఈ మేరకు ఏసీబీ విచారణ జరిపింది. ఈ చెల్లింపులపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏసీబీ నిరుడు డిసెంబర్‌లో విచారణ ప్రారంభించింది. అవకతవకలపై కేసు నమోదు చేసింది. ఇందులో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ సీఈ బీఎల్ఎన్ రెడ్డి పేర్లను చేర్చింది. ఈ కేసులో కీలకంగా ఉన్న ఏస్‌నెక్స్ట్‌జెన్ సంస్థ ప్రతినిధులను ఏసీబీ జనవరిలో విచారించింది. సంస్థ డైరెక్టర్ అనిల్‌ను సుమారు రెండున్నర గంటల పాటు ప్రశ్నించారు.

భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

మరోవైపు ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు స్పందించారు. కేటీఆర్‌పై రాజకీయకక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ట అని ఆయన ఆరోపించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందని, ప్రతిపక్ష నేతలను వేధించడమే రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. స్థానికఎన్నికల్లో రాజకీయలబ్ధి కోసం చిల్లర డ్రామాలు చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఈయనతో పాటు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డితో పాటు పలువురు నేతలు రాజకీయ కక్ష మేరకే కేసులు పెట్టారంటూ భగ్గుమన్నారు.

సింగరేణికి 'నీతి ఆయోగ్'లో చోటు

మొదటిపేజీ తరువాయి

జరుపుతున్నామని, కీలక ఖనిజరంగంలో గల అవకాశాలను అధ్యయనం చేయటానికి ఏజెన్సీలను నియమించుకున్నామని తెలిపారు. ఇటీవల కేంద్రం నిర్వహించిన కీలక ఖనిజాల అన్వేషణ వేలంలో సింగరేణి సంస్థ పాల్గొని బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్స్ కూడా సాధించిందన్నారు. సింగరేణి ప్రాంతంలోని గుట్టల్లో, ఓపెన్ కాస్ట్ గనుల మట్టిలో, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్ మరియు బాటమ్ యాష్ లో ఉన్న కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను గుర్తించడానికి, వాటిని వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడానికి గల అవకాశాలపై కలిసి పని చేసేందుకు జాతీయస్థాయి సంస్థలైన ఎన్ ఎఫ్ టి డి సి, ఐఎంఎంటీ, జె ఎన్ ఏ ఆర్ డి డి సి వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు రూ.161 కోట్లు విడుదల

- **ఆర్థిక శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశం**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : జూనియర్ కళాశాలు, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ లో ఆర్థిక శాఖ తో పాటు సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు 2,813 సంబంధించిన 161 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నట్టుగా అధికారుల సమీక్షలో నిర్ధారించారు. రూ.161 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ—ఈశాన్య మధ్య బంధాలు బలోపేతం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్: 'సంస్కృతుల సంగమం - సమృద్ధికి సోపానం' పేరుతో నగరంలో ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, గవర్నర్ సతీమణి సుధా దేవ్ వర్మ, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశంలో మొట్టమొదటి 'నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రాన్ని' తెలంగాణ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసే ప్రణాళికలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి గవర్నర్ నాయకత్వం వహించాలని కోరారు. కేంద్రం ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖతో పాటు ఎనిమిది రాష్ట్రాలతో కలిసి సమిష్టిగా పని చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాలు కూడా అన్ని రంగాలలో దేశానికి మరింతగా తోడ్పాటు అందిస్తున్నాయని అన్నారు. అస్సోం, అరుణాచల్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు అనుసంధాన కేంద్రంలో అవసరమైన హాస్టల్ సౌకర్యం, ఆహారం, కళలు, చేతి వృత్తులు, సంస్కృతులు, కళల ప్రదర్శనకు వేదికలుగా ఈ భవనాలు పని చేస్తాయన్నారు

ఇప్పటికే బలమైన సంబంధాలు

త్రిపురకు చెందిన జిష్ణుదేవ్ వర్మ తెలంగాణ గవర్నర్‌గా, తెలంగాణకు చెందిన ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా పనిచేస్తున్న నేపథ్యంలో ఇప్పటికే బలమైన సంబంధాలను కలిగి ఉన్నామని సీఎం రేవంత్ చెప్పారు. తెలంగాణ ఈశాన్య రాష్ట్రాల మధ్య మరింత సహకారానికి, ప్రజల మధ్య సంస్కృతుల పరస్పర మార్పిడికి ఈ ఉత్సవాలు నాంది మాత్రమేనన్నారు. ఈ ఉత్సవాలు ఈశాన్య రాష్ట్రాలకు తెలంగాణకు మధ్యన ఉన్న ఏకత్వ స్ఫూర్తిని చాటుతున్నాయన్నారు. 'ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు తెలంగాణ రెండో ఇల్లు లాంటిది. హైదరాబాద్‌కు ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఐటీ, ఫార్మా, హెల్త్ కేర్, టూరిజం, హాస్పిటాలిటీ, స్టార్టప్, క్రీడల వంటి అన్ని రంగాలలోనూ విజయవంతంగా రాణిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు తెలంగాణ సమాజంతో కలిసిపోయి, ఇక్కడ అభివృద్ధికి తోడ్పడుతున్నందుకు వారికి ధన్యవాదాలు' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఈ ఉత్సవాలలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఈశాన్య రాష్ట్రాల నుంచి దాదాపు 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

రాజశేఖర్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- **బాధితులనుపరామర్శించిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్**

ప్రతిపక్షం ప్రతినిధి, రంగారెడ్డి, నవంబర్ 20: ఫరుక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో ఇటీవల హత్యకు గురైన ఎర్ర రాజశేఖర్ కుటుంబాన్ని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య కమిషన్ సభ్యులతో కలిసి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్ర రాజశేఖర్ హత్య దుర్మార్గమైన చర్య అని, సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. దీనిని మానవతావాదులు, మేధావులంతా ఖండించాలని అన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు జీవితఖైదు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, దీనికి ఎస్సీ ఎస్టీ కమిషన్ సహకరిస్తుందని ఆయన అన్నారు. రాజశేఖర్ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు లేదా డబుల్ బెడ్రూం ఇంటిని ఇప్పించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో పాటు అవసరమైతే ముఖ్యమంత్రితో మాట్లాడి 5 ఎకరాల భూమిని కేటాయించేలా చూస్తానని ఆయన తెలిపారు. అనంతరం రాజశేఖర్ కుటుంబానికి రూ.4 లక్షల 12 వేల 500ల చెక్కును చైర్మన్ వెంకటయ్య అందజేశారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంట కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డిసిపి పూర్ణ చంద్ర, షాద్ నగర్ ఆర్డీవో సరిత, ఫరూక్ నగర్ తహసిల్దార్ నాగయ్య, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రామారావు, ఇతర అధికారులు ఉన్నారు.





పెయిడ్ ఆర్టిస్టులతో జగన్ కోర్టులను మభ్యపెట్టలేరు. విచారణలో భాగంగా కోర్టులకు హాజరయ్యేవారు వినయంగా వ్యవహరిస్తారు. తాను కోర్టుకు హాజరైతే సమస్యలు ఎదురవుతాయని కోర్టును నమ్మబలికే ప్రయత్నంలో భాగంగానే హైదరాబాద్లో నానా హంగామా చేశారు. జగన్‌లో ఎటువంటి పశ్చాత్తాపం కనిపించడం లేదు. అక్రమాస్తుల కేసులో ఆయన జైలుకు వెళ్లడం ఖాయం.

- ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్

దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ

- కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి సూచన
- పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్న ప్రహ్లాద్ జోషి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల ద్వారా వినియోగదారులకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. నగరానికి వచ్చిన కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రజలకు సన్నబియ్యం పంపిణీ అంశంపై వివరించారు. ప్రజలు తినే బియ్యం సరఫరా చేసినప్పుడే ఆ సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్నట్టుగా దేశ వ్యాప్తంగా వినియోగదారులకు సన్నబియ్యం పంపిణీ చేసే అంశాన్ని కేంద్రం పరిశీలించాలని సూచించారు. ఈ విషయంలో అవసరమైతే సమగ్రంగా అధ్యయనం చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. పూర్తి స్థాయి అధ్యయనం జరిపిన తరువాత దేశ వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ అంశంపై నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అర్బన్ నక్సల్స్ చిన్న పిల్లలను రెచ్చగొడుతున్నారు

- ఏసీ గదులలలో కూర్చుని కోట్లు సంపాదిస్తున్నారు
- కేంద్ర హోమ్ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : తుపాకులు పట్టుకొని అడవులకు వెళ్లమని చిన్న పిల్లలను అర్బన్ నక్సలైట్లు రెచ్చగొడుతున్నారని కేంద్ర హోమ్ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. అర్బన్ నక్సలైట్లు పట్టణాలలో ఏసీ గదులలో కూర్చుని ఉంటారని విమర్శించారు. కార్లలో తిరుగుతూ, సొంత పైరవీలు చేసుకుంటూ కోట్లు సంపాదిస్తున్నారని అన్నారు. తమ మాటలతో యువతను, మిగతా వారిని లొంగిపోవాలని చెప్పకుండా రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధిని అడవులలో ఉన్నవారు కూడా గ్రహించారని చెప్పారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాసిక్యూషన్ కు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అనుమతిపై ఇప్పుడు కాంగ్రెస్ ఏం చెప్తుందని బండి ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒకటే అని విమర్శించిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఏం మాట్లాడతారో చెప్పాలన్నారు. గవర్నర్ అటు అనుమతివ్వొద్దనే సీఎం కోరుకున్నారని ధ్వజమెత్తారు. అవినీతిపరుల ఆస్తుల జప్తు చేస్తానని గతంలో రేవంత్ రెడ్డి అన్నారని బండిసంజయ్ పేర్కొన్నారు.



బంగాళాఖాతంలో మళ్లీ అల్పపీడనం

- 24 నాటికి వాయుగుండంగా మారే ఛాన్స్.. రాబోయే రోజులలో మరింత పెరగనున్న చలి
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ నెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. తదుపరి 48 గంటలలో ఇది పశ్చిమ వాయువ్య దిశలో కదులుతూ మరింత బలపడి 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. రాగల రెండు రోజులలో కొన్ని ప్రాంతాలలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు నుండి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. కొద్ది రోజులుగా సాయంత్రం ఐదు అయ్యిందంటే చాలు రాష్ట్రం మొత్తం చలితో గజగజా వణికిపోతోంది. ఉదయం తొమ్మిది గంటలైనా ఆ ప్రభావం కొనసాగుతూనే ఉంది. రాత్రి నుంచి ఉదయం వరకు చాలా ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏడు డిగ్రీల సెల్సియస్, సంగారెడ్డి 7.1, ఆదిలాబాద్ 7.7, వికారాబాద్ 8.1, రంగారెడ్డి 8.2, కామారెడ్డి 8.5, సిద్దిపేట 8.6, నిజామాబాద్ 8.9, జగిత్యాల 9, మెదక్ 9.3, నిర్మల్ 9.4, మహబూబ్‌నగర్ జిల్లాలలో 9.9 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. సాధారణంగా డిసెంబరు నెలలో చలి అధికంగా ఉంటుంది. కానీ, ఈ సీజన్‌లో మాత్రం నవంబరు నెల నుంచే చలి పంజా విసరుతోంది.



పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలి

- ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా జి. చిన్నారెడ్డి
- ప్రజా భవన్ లో 'బాలల ప్రజావాణి' నిర్వహణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాల్సిన ఆవశ్యకత, బాధ్యత తల్లిదండ్రులు, గురువుల మీద ఉందని సీఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా గురువారం నాడు బాలల ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలను వివిధ రంగాలలో ప్రోత్సాహించాలని సూచించారు. పిల్లల మనసెరిగి వారి మనోభావాలకు అనుగుణంగా పెద్దలు ముందుకు సాగాలని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల పట్ల గౌరవంగా ఉండాలని, బాల్య వివాహాలు చేయొద్దని చెప్పారు. బాలల హక్కులను పరిరక్షించాలని అన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, యూనిసెఫ్ సౌత్ ఇండియా చీఫ్ జలేలం తఫెసి, చైల్డ్ రైట్స్ సంస్థ అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





చుక్క రామయ్య 100వ జన్మదిన వేడుకలు

- శాలువా కప్పి సన్మానించిన ప్రముఖులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో,హైదరాబాద్, నవంబర్ 20 : ప్రఖ్యాత విద్యావేత్త చుక్క రామయ్య 100వ జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు గురువారం విద్యానగర్ లోని ఆయన నివాసానికి చేరుకుని ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్, తలసాని, ఎమ్మెల్యే కాలేరు ముఠాగోపాల్ , కోదండరాంతో పాటు పలువురు కేక్ కట్ చేయించి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. చుక్క రామయ్య ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. విద్యా ప్రదాత, తెలంగాణ పోరాటంలో, రాజకీయాలలో దిక్సూచిగా తనదైన పాత్ర పోషించిన చుక్కా రామయ్య 100వ జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకమని కేటీఆర్ కొనియాడారు. ఆయన ఆరోగ్యంగా, సుదీర్ఘకాలం జీవించాలని ఆకాంక్షించారు. కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలసాని, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠాగోపాల్ చుక్క రామయ్యను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆరేండ్ల తరువాత కోర్టుకు వచ్చిన జగన్

- అక్రమాస్తుల కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు విచారణ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం నాడు సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. దాదాపు ఆరేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆయన మళ్లీ కోర్టుకు వచ్చారు. అక్రమాస్తుల కేసులో నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు విచారణ జరుపుతోంది. ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. ఎన్నికల అనంతరం సైతం మినహాయింపును కొనసాగించాలని కోరగా, నిరాకరించి తప్పనిసరిగా వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాల్సిందేనని చెప్పింది. దాంతో ఆయన ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి సీబీఐ ప్రత్యేక కోర్టుకు వెళ్లి న్యాయమూర్తి రఘురామ్ ఎదుట విచారణకు హాజరయ్యారు. జగన్ కోర్టుకు వస్తున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా హైదరాబాద్ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కేసులో సీబీఐ 11 చార్జిషీట్లు దాఖలు చేసింది. ఈ కేసులో తమ పేర్లను తొలగించాలంటూ దాఖలైన సుమారు 130 డిశ్చార్జి పిటిషన్లు సైతం ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ కేసులో దాఖలైన ఆరు వేర్వేరు పిటిషన్లపై గురువారం కోర్టు విచారణ చేపట్టింది. జగన్ కు మద్దతుగా వచ్చిన వెస్సార్‌సీపీ నేత పేర్ని నాని సహా పలువురు నేతలను పోలీసులు కోర్టు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కోర్టు ప్రధాన గేటు వద్ద అడ్డుకొని.. ప్రాంగణంలోకి అనుమతించలేదు. అదే సమయంలో భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు కోర్టు వద్దకు రాగా వారిని అక్కడి నుంచి దూరంగా పంపించి వేశారు.



చట్ట ప్రకారమే ఈ కార్ రేసింగ్ కేసు

- సీఎంకు ఎవరి మీద కక్ష సాధించాలని లేదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : బీజేపీకి చెందిన కీలక నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఉన్న సంబంధాలు అందరికీ తెలుసని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ కార్ రేస్ కేసులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించడంతో కేటీఆర్ పై చట్టం ప్రకారం చర్యలు చేపట్టామని అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కక్ష సాధింపు ఉంటే ప్రభుత్వం వచ్చిన వెంటనే అరెస్టు చేసేవాళ్లమన్నారు. చట్ట ప్రకారమే ఈ కార్ రేసింగ్ కేసులో ముందుకెళ్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీద కక్ష సాధించాలన్న ఆలోచన లేదని అన్నారు. కాళేశ్వరంపై సీబీఐ ఎందుకు విచారణ చేయడం లేదో బండి సంజయ్ చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పోదని, కక్ష సాధిస్తే మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, మాజీ మంత్రి హరీశ్ రావు ఇప్పటికే జైలులో ఉండేవారని అన్నారు. ప్రజల సొమ్ము ఎవరు తిన్నా శిక్ష అనుభవించాల్సిందేనన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం రేవంత్ రెడ్డికి మధ్య చీకటి ఒప్పందం ఉంటే ఆరు నెలల ముందే గవర్నర్ అనుమతి వచ్చేదని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఓటమితో బీజేపీకి దిమ్మతిరిగే గవర్నర్ అనుమతి ఇచ్చిందన్నారు. బీసీ రిజర్వేషన్ అంశంలో కాంగ్రెస్ చిత్తశుద్ధితోనే ఉందని స్పష్టంగా చేశారు. కేంద్ర ప్రభుత్వానికి అవకాశం ఉన్నా. బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం లేదని విమర్శించారు.



బండి సంజయ్ పై పేపర్ లీకేజీ కేసు కొట్టివేత

- పూర్తి నిరాధార కేసుగా తోసిపుచ్చిన హైకోర్టు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : కేంద్ర మంత్రి బండి సంజయ్ పై టెన్త్ క్లాస్ పేపర్ లీకేజీ కేసును హైకోర్టు గురువారం కొట్టివేసింది. పూర్తి నిరాధారమైన కేసుగా తోసిపుచ్చింది. ఉదయం 9 గంటలకు హిందీ పరీక్ష అయితే, అర్ధరాత్రి పోలీసులు బండి సంజయ్ పై కేసు పెట్టి అరెస్ట్ చేసారు. దాదాపు రెండు గంటలపాటు పోలీసులు, కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. మరుసటి రోజు తమ అత్తమ్మ కర్మకాండ ఉందని చెప్పినా వినలేదని బండి సంజయ్ ఆరోపించారు. ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడని కూడా చూడకుండా అమానుషంగా వ్యవహరించారని అన్నారు. అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ జిల్లాలలోని అనేక పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పారని అన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగారు. తరువాత పోలీసులు అయనను బొమ్మల రామారం పోలీస్ స్టేషన్ లో ఉంచారు. బండి సంజయ్ అక్రమ అరెస్ట్ పై అప్పట్లోనే అమిత్ షా, నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరిపారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న బండి సంజయ్ పై ద్వేషంతో అకారణంగా కేసులు పెట్టి వేధించింది. హైకోర్టు తీర్పు బీఆర్ఎస్ కు చెంప పెట్టని పార్టీ నేతలు అన్నారు.



సౌదీ ప్రమాద బాధితులకు కేటీఆర్ పరామర్శ

- కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20 : సౌదీ అరేబియాలో ఇటీవల జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన యాత్రికులు దుర్మరణం పాలయ్యారు. వారి కుటుంబాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం పరామర్శించారు. వారిని ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి మహమ్మద్ అలీ, బీఆర్ఎస్ నాయకులు ముఠా జై సింహ, కిషోర్ గౌడ్ ఆయన వెంట ఉన్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ దురదృష్టకర సంఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసి, మృతుల ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు. మృతదేహాల తరలింపు లేదా ఇతర అవసరమైన కార్యక్రమాల కోసం విదేశాంగ అధికారులతో స్వయంగా మాట్లాడతామన్నారు. మరణించిన వారి పట్ల పూర్తి శ్రద్ధ తీసుకోవడానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రత్యేక బృందాన్ని ఇప్పటికే సౌదీ అరేబియాకు పంపామని చెప్పారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ సిద్ధంగా ఉందన్నారు.

కేటీఆర్‌పై రాజకీయ కక్షసాధింపు

- ఈ కార్ రేస్ కేసు కాంగ్రెస్–బీజేపీ కుట్ర
- ప్రభుత్వ చర్యలపై హరీశ్ రావు ఆగ్రహం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20: ఫార్ములా ఈ కార్ రేస్ కేసు విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్-బీజేపీ కలిసి రాజకీయ కక్షతో కేటీఆర్‌ను బలహీనపర్చాలని చూస్తున్నాయని, గవర్నర్ ఇచ్చిన అనుమతి కూడా అదే కుట్రలో భాగమని నేతలు ఆరోపించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపేనని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమని ఆరోపించారు. పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించబడిన ఫార్ములా-ఈ రేస్‌పై రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అనవసర ఆరోపణలు చేస్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాజకీయ లాభం మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న కేటీఆర్‌పై కక్షపూరిత కేసులు నమోదు చేస్తూ రాక్షసానందం పొందటం అప్రజాస్వామికమని హరీశ్ రావు అన్నారు.

“



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న ఓట్ చోరీ, సమగ్ర ఓటరు సర్వే ఆరోపణలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎలక్షన్ కమిషన్‌పై ఉంది. ఆరోపణలపై పూర్తి స్థాయిలో నివృత్తి చేసి ప్రజాస్వామ్యంపై ఉన్న విశ్వాసాన్ని కాపాడాలి. రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై దర్యాప్తు చేయాలి. ప్రత్యారోపణలు చేయడం సరైనది కాదు.

-మాజీ సీఈసీ ఖురేషి

ఓపెన్ వాయిస్

పార్కునే రిజిస్ట్రేషన్ చేసిన ఘనుడు

ప్రభుత్వ ఉద్యోగం అనేది భరోసా మాత్రమే కాదు బాధ్యత కూడా. ఆ బాధ్యతను ఎంత సమర్థవంతంగా నిర్వర్తిస్తే ప్రజలకు అంత త్వరితగతిన సేవలు అందుతాయి. సేవలు త్వరితగతిన అందినప్పుడు ప్రజలలో ప్రభుత్వం మీద నమ్మకం ఏర్పడుతుంది. ఆ నమ్మకం కాస్త ప్రభుత్వాన్ని సుస్థిరం చేస్తుంది. సుస్థిర ప్రభుత్వం ఉంటే ఎటువంటి అద్భుతాలు జరుగుతాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ ఉద్యోగం అనేది కాసుల కురిపించే ఏటీఎం అని నేటి కాలంలో చాలామంది ఉద్యోగులు భావిస్తున్నారు. అందుకే ఉద్యోగాన్ని ఒక బాధ్యతలాగా కాకుండా దోపిడికి మార్గంగా భావించుకుంటున్నారు. కొందరు ఉద్యోగులతే వసూళ్లకు ఏకంగా వ్యక్తులను నియమించుకుంటున్నారు. తద్వారా కోట్లకు ఎదుగుతున్నారు. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఏసీబీ నమోదు చేస్తున్న కేసులను బట్టి, ప్రభుత్వ ఉద్యోగులు ఏ స్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. సబ్ కలెక్టర్ నుంచి మొదలు పెడితే పంచాయతీ కార్యదర్శుల వరకు అందరూ దొరికిపోతున్నారు. ఉద్యోగాన్ని ఒక బాధ్యతలాగా నిర్వర్తించకుండా వసూళ్లకు పాల్పడుతున్న ఉద్యోగులను మాత్రమే మనం చూశాం. ఏసీబీ కూడా అటువంటి సిబ్బంది మీద మాత్రమే కేసులు నమోదు చేస్తోంది. ఓ అధికారి అవినీతిని అంతకుమించి అనే స్థాయిలో ప్రదర్శించాడు. ఏకంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పార్కును అమ్మేశాడు. దీని కోసం కోట్లు లంచంగా పుచ్చుకున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నారు. రిజిస్ట్రార్లపై విపరీతంగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో దాడులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. నగర పరిధి వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో నెలల వ్యవధిలోనే ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లు సస్పెండ్ కావడం కలకలం సృష్టించింది. కొన్ని రోజుల క్రితమే రాజేశ్ అనే సబ్ రిజిస్ట్రార్ లంచం తీసుకుంటూ చిక్కడంతో సస్పెండ్ చేశారు. ఆ స్థానంలో అక్కడి సీనియర్ అసిస్టెంట్ శివశంకర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో, రంగంలోకి దిగిన ఉన్నతాధికారులు ఆయననూ సస్పెండ్ చేశారు. ఓ పార్కు స్థలానికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో శివశంకర్‌పై రిజిస్ట్రేషన్ల శాఖ వేటు వేసింది. సాహెబ్ నగర్ ప్రాంతంలో గతంలో ఉన్న లే ఔట్ (అనధికారిక) ఆధారంగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని అంటున్నారు. స్థానికులు కోర్టులను ఆశ్రయించి అనుమతులు తీసుకుని తమ భూములను రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఇదే సమయంలో అక్కడ ఉన్న పార్కు ప్రాంతానికి కూడా రిజిస్ట్రేషన్ కోసం అప్లై చేయగా, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సబ్ రిజిస్ట్రార్ పూర్తి చేశారు. ఈ వ్యవహారంపై స్థానికులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు విచారణ ప్రారంభించారు. శివశంకర్ తప్పు ఉందని గుర్తించడంతో సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతి నిరోధక శాఖ దాడులు జరుగుతున్న నేపథ్యంలో కార్యాలయాలలో ఉన్న లోపాలపై ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ల శాఖలో తెలంగాణ సర్కార్ కీలక సంస్కరణలు తీసుకువస్తున్నప్పటికీ.. సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది మారకపోవడంపై ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

ప్రతిపక్షం

హైదరాబాద్

శుక్రవారం
21.11.2025



పల్లె ప్రగతే దేశాభివృద్ధికి సూచిక

గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా వుండి, అభివృద్ధిని కాంక్షిస్తూ, వీలైతే యునానిమస్ గా ఎన్నికలు లేకుండా నిస్వార్థపరుడిని, గ్రామ క్షేమం, సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే వారిని ఎన్నుకోవడం ఎంతో మంచిది. కక్షలు, కుట్రలు లేకుండా, ఎన్నికల అధికారులతో సహకరిస్తూ, ఎలక్షన్ లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన భాద్యత ప్రతి పౌరుడిపై వున్నది. ప్రశాంత వాతావరణంలో, మరెంతో ప్రశాంతంగా ఎన్నికలలో పాల్గొంటూ ఒక మంచి వ్యక్తిని గ్రామ ప్రథమపౌరుడిగా ఎన్నుకుని గ్రామాభివృద్ధికి దోహదపడాలని ఆశిద్దాం.



డా. పోలం సైదులు
9441930361

గ్రామంలో ప్రజాస్వామ్యం వికసించి, అది స్వయం సమృద్ధి సాధించినప్పుడే జాతి అభివృద్ధి చెందుతుందన్నారు మహాత్మ గాంధీ. అందుకే గ్రామాలలో ప్రజల భాగస్వామ్యంతో స్వయం పాలనగావించడానికి పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఎప్పుడైతే గ్రామాలు అభివృద్ధి చెందుతాయో అప్పుడే సమాజం రాష్ట్రం, దేశం అభివృద్ధి దిశగా పయనిస్తాయి. గ్రామాభివృద్ధి అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహాయ సహకారాలతో ముడిపడి గ్రామపాలన గావించే గ్రామ ప్రథమ పౌరుడు (సర్పంచ్)పై ఆధారపడి ఉంటుంది. బీసీల 42 శాతం రిజర్వేషన్స్ కారణంగా న్యాయపర చిక్కులు తలెత్తడంతో కాస్తా ఆలస్యమైనా, ఎన్నో అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు ప్రభుత్వం నవంబర్ 17న జరిగిన కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు గడుస్తున్న నేపథ్యంలో డిసెంబర్ 1నుండి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించి, డిసెంబర్ రెండవ వారంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించింది. గ్రామాలలో రాజకీయ పార్టీలకు చెందిన నాయకత్వం రిజర్వేషన్ పరంగా అభ్యర్థులను ఖరారుచేసి, ఇప్పటికే ఎవరికి వారు అంతర్గత ప్రచార కార్యకలాపాలలో నిమగ్నమై ఉండటం గమనించవచ్చు. ఎన్నికలలో ఎన్నో వింతలను అంటే ఒకే కుటుంబానికి చెందిన ఇరువురి వ్యక్తులను అన్నా, తమ్ముడు, అన్న, చెల్లి, తల్లి, కొడుకు, అత్త, కోడలు బరిలో నిల్చోవడం లాంటి సంఘటనలను చూడవచ్చు. అలాగే ఈ ఎన్నికలలో అధికారపార్టీ తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి, ప్రతిపక్ష పార్టీ బలోపేతం కావడానికి ప్రయత్నంలో భాగంగా డబ్బు ఏరులై పారనుంది.

ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నం

ఓటర్లను ఆకర్షించడానికి చేయని ప్రయత్నం అంటూ ఉండదు. ఎన్నో నెరవేరలేని హామీలుస్తూ, బ్రతిమిలాడుతూ, భయపెడుతూ, బహుమతులనిస్తూ ప్రచారం చేస్తుంటారు. వాస్తవానికి గ్రామాలలో ఎన్నికయ్యే సర్పంచ్ పైననే గ్రామాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. గ్రామ ప్రథమ పౌరుడంటే ఇంటికి పెద్దదిక్కు వలే గ్రామానికి పెద్ద. గ్రామ ప్రజలను తమ కుటుంబసభ్యులుగా భావించి నిరంతరం వారి క్షేమం, సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతుండాలి. అంతేగానీ, ఏదో హోదాకోసమో ఆర్థికపరమైన వ్యాపారంగా భావించి లక్షలలో ఖర్చుపెట్టి వడ్డీతో సహా సంపాదించుకోవాలనో ఎన్నికలలో పోటీచేయవద్దు. గ్రామ ప్రజలు సైతం పార్టీలు, కులాలు, మతాలకతీతంగా డబ్బుకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వకుండా, సేవాదృక్పథం కలిగి ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడే నాయకున్ని ఎన్నుకోవాలి. ఫిబ్రవరి మాసం నుండి తెలంగాణ రాష్ట్రమంతట సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డుమెంబర్లు రాబోతున్నారు. వారు విధుల నిర్వహణ, అభివృద్ధిపై సరైన అవగాహన ఏర్పర్చుకోవాలి. గతంలో చరిత్ర సృష్టించిన కొన్ని విషయాలను పరిశీలిద్దాం.

ఇక్కడ అనేక అభివృద్ధి ఫలాలు

రంగారెడ్డి జిల్లా హాజిపల్లి గ్రామపంచాయతీకి ప్రథమ పౌరురాలు గ్రామంలోని వీధులన్నింటిని సిమెంటులో నిర్మించారు. ప్రతి వీధికి మురుగు కాలువలను నిర్మించారు, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి కట్టించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయితీ భవనం, గ్రంథాలయాన్నీనిర్మించి 2008లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా 'నిర్మల్ గ్రామ పురస్కారాన్నీఅందుకున్నారు. అదే సంవత్సరం నవంబర్ మాసంలో రాష్ట్రప్రభుత్వం నుండి 'శుభం' అవార్డు పొందడం అనేది మిగతా గ్రామ ప్రథమపౌరులకు ఆదర్శం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి, కరీంనగర్ జిల్లాలోని రామచంద్రపురం, నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ గ్రామం, మహారాష్ట్రంలోని అహ్మద్ నగర్ జిల్లాలోని హైవేర్ బజార్ ఈ కోవకు చెందినవే. విజయవంతంగా గ్రామసభలను జరిపి, పలు సమస్యలకు పరిష్కార మార్గాలు చూపారు. గంగాదేవిపల్లిలో 18 రకాల కమిటీలు వేసి ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్యం, సమాచారం అందేలా చూశారు. ఓ సమస్య వచ్చినా, కమిటీలను సంప్రదించి సులభంగా పరిష్కరించుకునే విదంగా యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. బడీడు పిల్లలను పాఠశాలలలో చేర్పించేటట్లు యంత్రాంగాన్ని తయారుచేసి గ్రామంలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి చేశారు. జనాభా నియంత్రణలో భాగంగా ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్స్ చేయించారు. పిల్లలకు పోలియో చుక్కలు, టీకాలు, వివిధ వ్యాక్సిన్లు సకాలంలో అందరికి అందేటట్లు చూడటంలాం టివి చేశారు.

గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా వుండి

గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా వుండి, అభివృద్ధిని కాంక్షిస్తూ, వీలైతే యునానిమస్ గా ఎన్నికలు లేకుండా నిస్వార్థపరుడిని, గ్రామ క్షేమం, సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే వారిని ఎన్నుకోవడం ఎంతో మంచిది. కక్షలు, కుట్రలు లేకుండా, ఎన్నికల అధికారులతో సహకరిస్తూ, ఎలక్షన్ లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన భాద్యత ప్రతి పౌరుడిపై వున్నది. ప్రశాంత వాతావరణంలో, మరెంతో ప్రశాంతంగా ఎన్నికలలో పాల్గొంటూ ఒక మంచి వ్యక్తిని గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నుకుని గ్రామాభివృద్ధికి దోహదపడాలని ఆశిద్దాం.

శబ్దానికి శాశ్వత జీవం పోసిన ఎడిసన్




రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

మానవ విజ్ఞాన చరిత్రలో 1877 నవంబర్ 21వ తేదీ ఒక అద్భుత మలుపును తెచ్చింది. ఆ రోజు థామస్ అల్వా ఎడిసన్ తన ఫోనోగ్రాఫ్ ఆవిష్కరణను ప్రకటించాడు. అప్పటి వరకు మనిషి మాట్లాడే మాట, పాడే పాట, వాయించే సంగీతం, వాటి ధ్వని గాలిలో అలుముకుని మరుగునపడే క్షణిక అనుభూతి మాత్రమే. శబ్దాన్ని ఏదైనా ఒక వస్తువులో బంధించి, తిరిగి వినిపించడం అసాధ్యమని భావించిన దశలో ఎడిసన్ చేసిన ఈ ప్రయోగం మానవ మేధస్సు సరిహద్దులను తిరగరాసింది. శబ్దం గాలి తరంగాల రూపంలో కదులుతుంటే, ఆ తరంగాలు ఏదైనా పలకను కంపింప జేస్తాయని ఎడిసన్ గ్రహించాడు. ఆ కంపనం సూదిపై పడితే, సూది ఏదైనా మృదువైన లోహ పూతపై చిన్న గీతలను గీస్తుంది. ఈ గీతలే శబ్దపు గుర్తులు. ఇక అదే సూది ఆ గీతలను తిరిగి అనుసరిస్తే, మొదట వచ్చిన కంపనం మళ్లీ ఉత్పత్తి అవుతుంది. అలా అసలు శబ్దమే తిరిగి వినిపిస్తుంది. ఈ సరళమైన కాని విప్లవాత్మక సూత్రాన్ని ఆధారంగా తీసుకుని ఎడిసన్ ఫోనోగ్రాఫ్‌ను రూపుదిద్దాడు. టిన్‌ఫాయిల్‌తో చుట్టిన సిలిండర్, దానిపై ఒక సూది, శబ్దాన్ని స్వీకరించే చిన్నడైఫ్రాగ్మ్, ఇంత చిన్న యాంత్రిక వ్యవస్థలో మానవ స్వరాన్ని బంధించడమే ఆయన అద్భుతం. తన తొలి రికార్డింగ్ 'Mary Had a Little Lamb' అని చదివి, తర్వాత అదే తన పరికరం నుండి తిరిగి వినిపించినప్పుడు ప్రయోగశాలలో ఉన్న శాస్త్రవేత్తలు, సహాయకులు ఉలిక్కి పడ్డారు. శబ్దానికి చరిత్ర ఇచ్చిన క్షణం అదే. ప్రపంచం దానిని ఒక మంత్రదండం లాంటి ఆవిష్కరణగా చూసింది. శబ్దం ఇక క్షణికం కాదు. అమరం అయింది.

సంగీత ప్రపంచం కొత్త దశకు

ఫోనోగ్రాఫ్‌తో కలిగిన ప్రభావం అపరిమితం. సంగీత ప్రపంచం కొత్త దశకు ప్రవేశించింది. అప్పటి వరకు సంగీతం ప్రత్యక్షంగా వినడం మాత్రమే సాధ్యం. ఈ ఆవిష్కరణతో పాటలు, స్వరాలూ, కళాకారుల గాత్రాలూ గత కాలాన్ని దాటి భవిష్యత్ తరాలకు చేరే మార్గం తెరుచుకుంది. ఫోనోగ్రాఫ్ సూత్రం తర్వాత గ్రామోఫోన్ రికార్డులు, వినైల్ ప్లేట్లు, మాగ్నెటిక్ టేపులు, చివరకు డిజిటల్ శబ్ద సాంకేతికత వరకూ ఒక శ్రేణిగా అభివృద్ధి చెందింది. నేటి సంగీత పరిశ్రమ, రేడియో ప్రసారాలు, ఆడియో పుస్తకాలు, అటు సినిమా డబ్బింగ్ వ్యవస్థ, ఇవన్నీ ఫోనోగ్రాఫ్ అనే తొలి ఇటుకపై నిర్మించిన భవనం. సామాజికంగా కూడా దీని ప్రభావం విశాలం. రాజకీయ నాయకుల ప్రసంగాలు, ఇటు శాస్త్రవేత్తల ఉపన్యాసాలు, మహోన్నత కళాకారుల స్వరాలు, పురాణ గాయకుల గానములు, అన్నీ రికార్డింగ్ రూపంలో భద్రపడడంతో చరిత్ర మరింత సజీవమైంది.





విద్యా రంగంలో ఉపన్యాసాలు, పరిశోధనలలో ప్రయోగ ధ్వనులు, న్యాయ పరిశోధనలలో ప్రమాణ శబ్దాల నిక్షేపం అన్నింటికీ ఫోనోగ్రాఫ్ సూత్రం ఆధారం. ప్రపంచ సంస్కృతిలో ఎన్నో తరాలు వినిపించేలా ఎవరి స్వరాన్నైనా సంరక్షించడం, కాలాన్ని అతికించుకుని గళాన్ని భవిష్యత్తుకు బదిలీ చేయడం అనే భావన ఈ ఆవిష్కరణ వల్లే సాధ్యమైంది.

ఒక సాధనాన్ని సృష్టించడం కాదు

ఎడిసన్ చేసిన ఈ ఆవిష్కరణ కేవలం ఒక సాధనాన్ని సృష్టించడం కాదు, మానవ భావోద్వేగాన్ని, మాటను, సంగీతాన్ని కాలంతో పోరాడే శాశ్వతమైన పాత్రలో నిలబెట్టడం. పరిశ్రమ విప్లవం ముగింపు దశలో, విజ్ఞాన శాస్త్రం ఉధృతమైన కాలంలో ఈ ఫోనోగ్రాఫ్ ప్రపంచానికి కొత్త ఇంద్రియాన్ని ఇచ్చింది. శబ్ద సంరక్షణ అనే ఇంద్రియాన్ని. నేడు మనం వినే ప్రతి పాట, ప్రతి ప్రసంగం, ప్రతి శబ్ద రికార్డింగ్ వెనక ఈ ఒకే ఆవిష్కరణ నిలబడి ఉందని గుర్తిస్తే ఎడిసన్ ప్రతిభ ఎంత మహత్తరమో తెలుస్తుంది. 1877 నవంబర్ 21న జరిగిన ఆ ప్రకటన ప్రపంచాన్ని కొత్త శబ్ద యుగం వైపు నడిపిన తీర్మానమైన రోజు. శబ్దాన్ని కేవలం వినడమే కాక, దాన్ని నిలిపి పెట్టి తిరిగి వినగలుగుతున్నామంటే, అది ఫోనోగ్రాఫ్ అనే ఆ మహోన్నత ఆవిష్కరణ వల్లే. శాస్త్రం, సాంకేతికత, సంస్కృతి, ఇవన్నింటి మధ్య దారిని కలిపిన అద్భుత సేతుసమం ఫోనోగ్రాఫ్. మానవ చరిత్రలో శబ్దం శాశ్వతమై నిలిచిన ఘట్టం, అదే ఎడిసన్ ఫోనోగ్రాఫ్ జననం.

(నేడు ఎడిసన్ ఫోనోగ్రాఫ్ ఆవిష్కరించిన రోజు)

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్)



'ఫ్రీ' బస్సులలో జనం బే'జారు'



అంబీర్ శ్రీకాంత్
81859 68059

రాష్ట్ర సర్కారు ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు జర్నీతో బస్సు ప్రయాణం బేజారవుతోంది. ప్రధాన రూట్‌లలో రెట్టింపు సంఖ్యలో జనం ఇబ్బందులు పడుతూనే వాటిలో ప్రయాణిస్తున్నారు. ఆక్యుపెన్సీ రెట్టింపు సంఖ్యలో ఉంటున్నది. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచుకోవడం, సిబ్బందిని సైతం నియమించుకోవడం పై సర్కారు దృష్టి సారించాలి. ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సుప్రయాణంతో మహిళా లోకం సంతోషం వ్యక్తం చేస్తోంది. కానీ, బస్సులో సామర్థ్యానికి మించిన ప్యాసింజర్లు వెళ్లే క్రమంలో అనుకోని ప్రమాదాలు ఎదురైతే విషాదాలు నెలకొనే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. డ్రైవర్, కండక్టర్ల తిప్పలను సైతం ఆర్టీసీవారు, రవాణా శాఖ పట్టించుకోవాలి. రద్దీ రూట్‌లలో సర్వీసులు పెంచాలనే డిమాండ్‌ను ప్రత్యేక దృష్టితో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలి.

మరో ప్రమాదం జరగకముందే

ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలను చూసి జనం భయాందోళన చెందుతున్నారు. సౌదీలో జరిగిన యాక్సిడెంట్‌లో హైదరాబాదీలు సుమారు 45 మంది మృతిచెందారు. ఈ ఘటనలను చూస్తే ప్రజలు ఏ వెహికల్ అయినాసరే జర్నీ చేయాలంటేనే ఉలిక్కిపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి తరుణంలో రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి, ఆయా ప్రాంతాల నుంచి సమీప పట్టణాలకు వెళ్లే బస్సులలో సామర్థ్యానికి మించి జనం వెళుతున్నారు. 'మహాలక్ష్మి' స్కీమ్‌లో భాగంగా గత 23 నెలలుగా మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. ఇలాంటిసమయంలో ప్రమాదాలు జరిగితే నష్ట తీవ్రత ఏ మేరకు ఉంటుందో అంచనా వేయొచ్చు. నిల్చునేందుకు చోటు లేకుండా..బస్సు డోర్ల వద్ద డ్రైవర్ బ్రేక్ వేస్తే..బే'జారు'కునేలా ప్రయాణికులు జర్నీ చేస్తున్నారు.

అత్యవసర పరిస్థితులలో

రద్దీతో అత్యవసర పరిస్థితులలో దిగేందుకు సైతం వీలుండే పరిస్థితి ఉండకపోవడం, డ్రైవర్లు నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ప్రమాద ఘటనలు ఇటీవల జరిగాయి. ఈ నేపథ్యంలోనే ఆర్టీసీ ఉన్నతాధికారులు, రవాణా శాఖ మంత్రి, ఆఫీసర్లు ఈ విషయాలన్నింటిపై దృష్టి సారించాలి. 'చికిత్స కంటే నివారణే మేలు' అనే వైద్య సూత్రాన్ని ఇక్కడా 'ప్రమాదం జరగకముందే నివారణకు అప్రమత్త చర్యలు తీసుకోవడంపైన' దృష్టి సారించాలి. ఆర్టీసీ డిపోలలో సిబ్బంది, డ్రైవర్ల కొరతపైనా ఫోకస్ చేయాలి. సిబ్బంది ఆరోగ్యం, విధులు, అదనపు విధుల కేటాయింపు, బస్సుల రిపేర్లపైనా ప్రత్యేకంగాదృష్టి సారించాలి. ప్రజా ప్రభుత్వంలో ప్రజల భద్రతపైనా ప్రశ్నలు ఉత్పన్నమయితే మొత్తం వ్యవస్థకే తలవంపు రావడంతో పాటు సర్కారుకు చెడ్డపేరు వస్తుందని సంగతి గుర్తెరిగి, చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన అవసరంఎంతైనా ఉంది.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం




జీహెచ్ఎంసీలో స్టాండింగ్ కమిటీ సమావేశం

- 18 ఎజెండా అంశాలు, 6 టేబుల్ ఐటమ్‌లకు ఆమోదం

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 20: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. కమిషనర్ ఆర్.వి. కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు మరియు వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో మొత్తం 18 ఎజెండా అంశాలు మరియు 6 టేబుల్ ఐటమ్‌లకు ఆమోదం లభించింది. సమావేశంలో సనత్‌నగర్ ప్రాంతంలో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం, ఓవైసీ జంక్షన్ నుంచి సంతోష్‌నగర్ వైపు రోడ్ డెవలప్‌మెంట్, రసూల్‌పుర్ జంక్షన్‌లో ప్రతిపాదిత రహదారి విస్తరణ, ఏ ఓ సి సెంటర్ చుట్టూ ఫ్లైఓవర్ మరియు ప్రత్యామ్నాయ మార్గాల రూపకల్పన, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు, ఖిల్వత్‌లో మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వంటి కీలక అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. ఫతేహ్‌బౌల్-నసల్‌నగర్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి ఆస్తుల స్వాధీనం, ఫలక్‌నుమాలో కొత్త ఆర్ ఓ బి నిర్మాణం, ఫతేనగర్ ఫ్లైఓవర్ పునరుద్ధరణ పనులకు పరిపాలనా ఆమోదం, క్రీడాసముదాయాల నిర్వహణ, స్పోర్ట్స్ అధికారుల పదోన్నతులు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఆధునికీకరణ వంటి పలు అభివృద్ధి అంశాలు సమావేశంలో ఆమోదం పొందాయి. సికింద్రాబాద్ ప్రాంతంలోని పరిశుభ్రత పనులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నిర్వహించేందుకు, అలాగే పలు జిహెచ్ఎంసి సర్కిల్‌స్‌లో ప్రత్యేక ఏజెన్సీలను ఎంపిక చేసేందుకు అనుమతులు మంజూరయ్యాయి. అలాగే జిహెచ్ఎంసి ఆదాయం, వ్యయాల నెలవారీ నివేదికలను సమాచారం కోసం కమిటీకి అందజేశారు. టేబుల్ ఐటమ్‌లలో భాగంగా అబిడ్స్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సెల్లార్ దుకాణాల కోసం టెండర్ ఆహ్వానం, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ లీజ్ పొడిగింపు, జిహెచ్ఎంసి వాహనాల కోసం జీపీఎస్ ఆధారిత ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు, ఫిర్యాదుల పరిష్కారానికి 50 సీట్ల కాల్‌సెంటర్ ఏర్పాటు, గెలీలియో నగర్‌లో స్పోర్ట్స్ అరినా అభివృద్ధి, జిహెచ్ఎంసి హిల్ లాక్ భూములను జూబ్లీహిల్స్‌లోని ప్రైవేట్ భూమితో మార్చుకునే ప్రతిపాదనలకు కూడా కమిటీ ఆమోదం తెలిపింది. జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్‌లో సుందరీకరణ పనులను 23వ తేదీలోపు పూర్తి చేయాలని మేయర్ ఆదేశాలు. అదే రోజు సాయంత్రం జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ ప్రాంగణంలో జరుగుతున్న సుందరీకరణ పనులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పరిశీలించారు. ఫౌంటెన్, ల్యాండ్‌స్కేపింగ్, డా.బి.ఆర్. అంబేద్కర్ మరియు మహాత్మాగాంధీ విగ్రహాల చుట్టూ జరుగుతున్న పనులు, పెయింటింగ్, కొత్త బోర్డుల ఏర్పాటును ఆమె పరిశీలించారు. ఈ నెల 25న జరగనున్న జిహెచ్ఎంసి జనరల్ బాడీ మీటింగ్‌కు ముందే ఈ పనులను పూర్తిచేయాల్సిన అవసరం ఉందని, 23వ తేదీ నాటికి అన్ని పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

2026 ట్రేడ్ లైసెన్స్ కొత్త & రెన్యూవల్ షెడ్యూల్ విడుదల

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కారణంగా అమలులో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వల్ల ట్రేడ్ లైసెన్స్ అప్లికేషన్ గడువులో మార్పు చేసింది GHMC. 2026 సంవత్సరానికి సంబంధించిన ట్రేడ్ లైసెన్‌స్‌ల కొత్త దరఖాస్తులు మరియు రెన్యూవల్ కోసం డిసెంబర్ 20, 2025 వరకు ఎటువంటి జరిమానా లేకుండా అప్లై చేసుకునేలా అవకాశం కల్పించింది. డిసెంబర్ 20 తర్వాత అప్లై చేసుకునే వారికి 60 రోజుల వరకు 25% జరిమానా, తరువాత 50% జరిమానా విధించబడుతుంది. గ్రీన్ ఫండ్ కింద రూ.5000 వరకు ఫీజుపై 10% అదనపు చార్జ్, రూ.5000 పైబడినవారికి రూ.1000 వర్తిస్తుంది. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిపై 100% జరిమానా మరియు ప్రతి నెలకు 10% అదనపు ఫైన్ విధించనున్నట్లు జిహెచ్ఎంసి స్పష్టం చేసింది. వ్యాపారులు నిర్ణీత తేదీలలో జిహెచ్ఎంసి వెబ్‌సైట్, మీ సేవ కేంద్రాలు లేదా సిటిజన్ సర్వీస్ సెంటర్‌ల ద్వారా దరఖాస్తు చేసుకొని జరిమానాలను తప్పించుకోవాలని సూచించింది.



ఉచిత మెగా హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రతిపక్షం, ఉప్పల్, నవంబర్ 20 : ఉప్పల్ నియోజకవర్గంలో పరిధిలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, మీర్పేట్ వారి ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్, సీయోన్ కాన్సర్ క్లినిక్, ఎమ్ ఎస్ రెడ్డి లయన్ కంటి ఆసుపత్రి సహకారంతో మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సూర్య నగర్ కాలనీలోని మోడరన్ హై స్కూల్లో ఉచిత మెగా మెడికల్ హెల్త్ క్యాంపును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఇట్టి మెగా హెల్త్ క్యాంప్ లో ఉచిత మందులతో సాధారణ ఆరోగ్య పరీక్షలు దంత పరీక్షలు ,కార్డియాలజీ, ఈ ఎన్ టి ల్యాబ్ పరీక్షలు, కంటి పరీక్షలు లాంటి అన్ని పరీక్షలు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మోడెర్న్ స్కూల్ యమాన్యం సచిదేవి, ముత్యంరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మీర్పేట్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి సభ్యులు రామచందర్, రమేష్, సత్యరెడ్డి, అంజిరెడ్డి మరియు స్థానికులు కోతి యాదగిరి గౌడ్, పద్మరెడ్డి, అంజయ్య, రవీందర్ రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, నవంబర్ 20 : కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేసే సిబ్బందిని, కార్మికులను కొంత మంది సూపర్వేజర్లు ఇబ్బందులకు గురించేస్తున్నారని అలాంటి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షబ్బీర్ అలీ, శానిటైజర్ ఇంచార్జ్ జయ్ రాజ్ కి పిర్యాదు చేయడం జరిగింది. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతు గతంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మూడు గ్రామాలుగా ఉండేదని, అప్పుడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కార్మికులు పని చేసే వారని వారికీ ఆ గ్రామపంచాయితీ జీతాలు ఇచ్చేదని గుర్తు చేశారు. అప్పుడు కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చిన కార్మిక సంఘం పేర్లు ఏదైనా బాచుపల్లి, ప్రగతినగర్లో చల్ల సుధీర్ రెడ్డి, నిజాంపేట్ ఆశి. యాదయ్య, నాయకత్వం వహించేదని అన్నారు. వారి నాయకత్వంలో కార్మికులు సిబ్బంది పని చేసే వారని అన్నారు. ఇప్పుడు ఉమ్మడి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పాటు అయినా తరువాత కొంత మంది స్వార్థ రాజకీయాల కోసం అనేక విధాలుగా కార్మికులకు, సూపర్వేజర్లు, వార్డు ఆఫీర్సలు ఇబ్బంది చేస్తున్నారని అన్నారు. నేటికీ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అందరిని కలుపుకొని అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామని అందుకే కార్మికలకు ఇబ్బంది కల్పించే సూపర్వేజర్లను, ఇతరులను బదిలీ చేయాలనీ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ఏఐటీయూసీ మున్సిపల్ అధ్యక్షులు ఆశి. యాదయ్య, పొన్నికంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



త్రాగునీరు సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రతిపక్షం, సిటి బ్యూరో/మహేశ్వరం, నవంబర్ 20 : మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నివాసంలో బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జలపల్లి మున్సిపాలిటీ, తుక్కుగూడ మున్సిపాలిటీ, పరిధిలో త్రాగునీటి సరఫరా సమస్యలపై హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.గత కొన్ని రోజులుగా పలు కాలనీల్లో త్రాగునీరు అనుకున్న స్థాయిలో అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే చర్యలు తీసుకొని తక్షణమే ఆయా ప్రాంతాలకు త్రాగునీరు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు నిరంతరంగా సరిపడినంత మంచి నీరు అందించేందుకు అదనపు పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు సమావేశంలో వెల్లడించారు. నీటి సరఫరాను మరింత బలోపేతం చేసి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని ఎస్ టి పి పనులకు కూడా ఆరా తీశారు ఎమ్మెల్యే స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో హెచ్ఎండబ్ల్యూఎస్ డైరెక్టర్ సుదర్శన్, సుజాత, చీఫ్ జనరల్ మేనేజర్ వినోద్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ నిసార్ అహ్మద్, సిజిఎం సంతోష్ కుమార్, కోడి, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్, మణికొండ శ్రీనివాస్ రెడ్డి సిజిఎం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ బాగుండాలి

- జెపి దర్గాలో కవిత మొక్కులు

ప్రతిపక్షం, రంగారెడ్డి జిల్లా, నవంబర్ 20: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు బాగుండాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం హజరత్ జహంగీర్ పీర్ దర్గా ను గురువారం రాత్రి ప్రత్యేకంగా సందర్శించుకున్నారు. షాద్ నగర్ నియోజకవర్గం పర్యటనలో భాగంగా ఆమె షాద్ నగర్ పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఆ తర్వాత కేశంపేట మండలంలోని తొమ్మిది రేకుల గ్రామాన్ని సందర్శించి అక్కడ గ్రామసభలో త్రిబుల్ ఆర్ రింగ్ రోడ్డు లో భూములు కోల్పోయిన బాధితులను కలుసుకున్నారు అనంతరం అక్కడి నుండి రాత్రి కొత్తూరు మండలంలోని జేపీ దర్గాకు చేరుకొని హజరత్ జహంగీర్ బాబా బురాన్ బాబాలకు పూల దట్టిలు ఎక్కించారు. అందరూ బాగుండాలని అందరి సంక్షేమను కోరుకుంటున్నట్లు ఆమె మీడియాతో అన్నారు. తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా పలు నియోజకవర్గాలను ఆమె పర్యటిస్తున్నట్లు తెలిపారు రేపు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పర్యటిస్తారని ఆమె మీడియాకు తెలిపారు.



వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి

- చేవెళ్ల ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ సతీష్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 20 : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ సతీష్ అన్నారు. మొయినాబాద్ మండలంలో గురువారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాహనదారులు తప్పని సరిగా రోడ్డు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, పోల్యూషన్ తదితర ధృవపత్రాలను కల్గివుండాలని తెలిపారు. లేని పక్షంలో చట్టరీత్య చర్యలతో పాటు భారీ జరిమానాలు విదించడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాపిక్ పోలీసులు తదితరులున్నారు.

గ్రామాల్లో దేవాలయాలకు సోలార్ భద్రత

- చిలుకూరు అర్చకుడి మార్గదర్శనం

ప్రతిపక్షం, మొయినాబాద్ , నవంబర్ 20: సామాజిక భద్రత, సుస్థిర అభివృద్ధి రంగాల్లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా దేశవ్యాప్తంగా బ్యాంకులు-దేవాలయాల భాగస్వామ్యానికి కొత్త దారిని చూపుతూ, చిలుకూరు బాలాజీ దేవాలయం గురువారం మొయినాబాద్ మండలంలోని పలు గ్రామ దేవాలయాల్లో 60 సోలార్ ఆధారిత సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సరఫరాదారునికి చెల్లింపును అందజేశారు. గ్రామీణ దేవాలయాల భద్రతను బలోపేతం చేయడమే కాకుండా, పర్యావరణ అనుకూల పర్యవేక్షణ వ్యవస్థలను ప్రవేశ పెట్టడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 50 కెమెరాలకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 10 కెమెరాలకు సీఎస్ఆర్ నిధులు అందించాయి. గ్రామీణ దేవాలయ భద్రతలో ఇలాంటి రిమోట్ సర్వైలెన్స్ సొల్యూషన్లను సీఎస్ఆర్‌కు అనుసంధానించడం దేశంలో ఇదే మొదటిసారి అని అధికారులు పేర్కొన్నారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ అదనపు డీసీపీ కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై, గ్రామీణ ప్రాంతాల్లో ఇదొక అత్యవసర భద్రతా చర్యగా అభినందించారు. ఎస్‌బీఐ డీజీఎం సలీల్ శుక్ల,



రీజినల్ మేనేజర్ నితిన్ కుమార్ మాట్లాడుతూ, రిమోట్ సర్వైలెన్స్‌ను సీఎస్ఆర్‌లో చేరుస్తుండటం గ్రామీణ దేవాలయాలకు కొత్త రక్షణా మార్గం తెరుస్తుందని అన్నారు. మొయినాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ ప్రాజెక్ట్‌కు సి.ఎస్. గోపాలకృష్ణ, వారసత్వ అర్చకులు & ధర్మకర్త, మరియు డాక్టర్ ఎం.వి. సౌందరరాజన్ తరఫున ఆయన కుమారుడు సి.ఎస్. రంగరాజన్ నాయకత్వం వహించారు. గ్రామీణ దేవాలయాల్లో విద్యుత్ సరఫరా లోపం, ధ్వంసం వంటి సమస్యల దృష్ట్యా సోలార్ ఆధారిత పర్యవేక్షణ అత్యవసరం అని వారు తెలిపారు. సోలార్ కెమెరాల అమరికతో 24 గంటల పర్యవేక్షణ, నేర నివారణ, భక్తుల భద్రత వంటి అంశాలు బలోపేతం కావడంతో పాటు గ్రామీణ దేవాలయాల మౌలిక వసతుల్లో పర్యావరణ అనుకూల సాంకేతికతకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. చిలుకూరు బాలాజీ అర్చకులు రంగరాజన్ మాట్లాడుతూ ఎస్‌బీఐ, యూబీఐ మరియు స్థానిక పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ ప్రాజెక్ట్ దేశవ్యాప్తంగా దేవాలయ సముదాయాల కోసం సీఎస్ఆర్ ఆధారిత సామాజిక భద్రతా మోడల్‌గా నిలుస్తుందని తెలిపారు.



గురుస్వామిని సన్మానించిన యువజన సంఘం అధ్యక్షుడు

ప్రతిపక్షం,మొయినాబాద్, నవంబర్ 20 : మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామానికి చెందిన ముదిగొండ మహేందర్ యాదవ్ గురుస్వామి 18వ సారి అయ్యప్ప మాల ధరించి హిమాయత్ నగర్ నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకొని బుధవారం హిమాయత్ నగర్ సన్నిధానానికి వచ్చారు. అజీజ్ నగర్ గ్రామానికి చెందిన అల్లం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పాదయాత్రలో బయలుదేరిన మహేందర్ గురుస్వామిని గురువారం హిమాయత్ నగర్ శాంతి యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విఠల్, మాల స్వామిలు, మహేందర్ గురుస్వామిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సన్నిధానం స్వాములు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



2026 మార్చి నాటికి ఏపీలో మావోయిజాన్ని అంతం చేస్తాం. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు చనిపోయారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్నాం. 50 మంది మావోలను అరెస్ట్ చేశాం. ఆంధ్రప్రదేశ్ని మావోలు లేని రాష్ట్రంగా మారుస్తాం. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుంది.

- ఏపీ డీజేపీ
హరీశ్ కుమార్ గుప్తా

ప్రాంతీయం



కేశవరావును కలసిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, నవంబర్ 20 : జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసనసభ్యులు వల్లాల నవీన్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వ ముఖ్య సలహాదారు కే కేశవరావు , హైదరాబాదు మేయర్ గద్వాల విజయలక్ష్మి , కే.కేశవరావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా కే. కేశవరావు మాట్లాడుతూ నవీన్ యాదవ్ గెలుపు భవిష్యత్తు రాజకీయ తరాలకు స్ఫూర్తిదాయకమని నవీన్ యాదవ్ లాంటి యువకులు రాజకీయాల్లో ఉంటే పేద బీద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తారన్నారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ కే.కేశవరావు సూచనలు సలహాలతో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజల సమస్యల కోసం కృషి చేస్తానని జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసనసభ్యులు నవీన్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దళిత జర్నలిస్టు ఫోరం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా

రాపాక విజయరాజు నియామకం

- దళిత జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కమిటీలో స్థానం ఇవ్వాలని ఫోరం డిమాండ్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 20 : దళిత జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తున్న దళిత జర్నలిస్టు ఫోరం (డీజేఎఫ్) కీలక నిర్ణయం తీసుకుంది. మెదక్ జిల్లా అధ్యక్షుడిగా రాపాక విజయరాజును నియమిస్తూ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కాశపోగు జాన్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఏ. డేవిడ్ అధికారిక ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు కాశ పోగు జాన్ తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షునిగా రాపాక విజయరాజుకు నియామక పత్రం అందజేయడం జరిగింది. జిల్లా స్థాయి కార్యకలాపాలను బలోపేతం చేయడానికి, జర్నలిస్టు సమస్యలను మరింత ప్రభావవంతంగా పరిష్కరించడానికి రాపాక విజయరాజు నియామకం చేపట్టినట్లు ఫోరం తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కాశపోగు జాన్ మాట్లాడుతూ దళిత జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని ఫోరం వ్యవస్థాపకుడు కాశపోగు జాన్ ప్రభుత్వం దృష్టికి రెండు ముఖ్యమైన డిమాండ్లను తీసుకొచ్చారు దళిత జర్నలిస్టులకు రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీలో తక్షణమే ప్రతినిధిత్వం కల్పించాలని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రాపాక విజయరాజు, మెదక్ జిల్లాలో దళిత జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యతనిస్తానని ఉమ్మడి జిల్లాలో ఉన్న దళిత జర్నలిస్టులందరినీ ఏకతాటిపై తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి ఎల్లేష్ జగత్ ప్రకాష్ పెద్దింటి స్వామి శ్రీకాంత్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 20 : కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ని హైదరాబాద్ లోని తాజ్ కృష్ణలో ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయనకు శాలువాతో సత్కరించి, పూల బొకే అందించారు. కేంద్ర మంత్రి నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు పటేల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సివిల్ సప్లై వ్యవస్థ పై, పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను, పలు అంశాలను కేంద్రమంత్రి కి వివరించారు.



జనసేన రాష్ట్ర కమిటీ సమావేశంలో మక్తల్ నాయకులు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, నవంబర్ 20: హైదరాబాద్ కూకట్ పల్లి లో జరిగిన జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వం, తెలంగాణ జనసేనపార్టీ రాష్ట్ర ఇంచార్జి నేమురి శంకర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఉమ్మడి జిల్లాల గ్రేటర్ హైదరాబాద్ మినహాయించి, తెలంగాణ 33 జిల్లాల జనసేన పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మక్తల్ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి డాక్టర్ మణికంఠ గౌడ్ ని ప్రత్యేకంగా గుర్తించి ఆయనను ఆయన చేస్తున్న పార్టీ కార్యక్రమాలను పనులను చూసి అభినందించారు. జనసేన పార్టీని భవిష్యత్తులో ఇంకా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నాయకత్వం కోరారు. మణికంఠ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర అన్ని నియోజకవర్గల జనసేన నాయకుల సమక్షంలో వేదిక పైన ప్రసంగించడానికి అవకాశం కల్పించిన నేమురి శంకర్ గౌడ్ కి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ కి మహబూబ్ నగర్ ఇంచార్జి సురేష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో మక్తల్ జనసేన పార్టీ నాయకులు బాల్ రెడ్డి పాల్గొన్నారు.


అంబేద్కర్ యువజన సంఘం పేరు దుర్వినియోగం

- ఫిర్యాదు చేసిన బాధ్యులు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, నవంబర్ 20: మక్తల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ రిజిస్ట్రేషన్ నెంబర్ 717/197 ను ఉపయోగించి సంఘంలో సభ్యత్వం కూడా లేనివారు పత్రిక ప్రకటనలు మరియు సోషల్ మీడియా గ్రూప్స్ లలో ప్రచారం చేసుకుంటున్న వారిపై సంఘం బాధ్యులు ఫిర్యాదు చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం రిజిస్ట్రేషన్ నెంబర్ 717/1978 లో అధ్యక్షులుగా పృథ్వీరాజ్, ఉపాధ్యక్షులుగా బ్యాగరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా బండారి కృష్ణ, సహాయ కార్యదర్శిగా కర్రెమ్ రవికుమార్, కోశాధికారిగా దాసరి త్రిమూర్తి, ఉప కోశాధికారిగా వై తరుణ్ కుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా కే పరంజ్యోతి, కార్యవర్గ సభ్యులుగా అంజయ్య, శ్రీనివాసులు ఇలా మొత్తం 9 మందిని అధికారిక కమిటీగా జిల్లా రిజిస్ట్రేషన్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా పృథ్వీరాజ్ మాట్లాడుతు సంఘం అధికారిక బాధ్యులుగా ఉన్న వీరు కాకుండా వేరే వాళ్ళు ఎవరైనా రిజిస్ట్రేషన్ నెంబర్ 717/1978 ఉపయోగించి ఏవైనా ప్రకటనలు ఇస్తే వాటిని పరిగణలోకి తీసుకోకూడదని కోరారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 20 : మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని, ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ్య అన్నారు. ఎస్ఎఫ్ఐ కార్యాలయం లో జండా ఆవిష్కరణ చేయడం జరిగింది. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా గర్ల్స్ కన్వెన్షన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. 22 మందితో కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య హాజరై మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైందని అగ్రహం వ్యక్తం చేసారు షిటీమ్స్ ఎక్కడ కూడా సరిగ్గా పని చేయడం లేదని మహిళల పై హత్యచారాలు రోజు రోజు కి పెరిగి పోతున్నాయి అని వాటిని అరికట్టడం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అధికంగా హత్యాచార ఘటనలు పెరిగిపోతున్నాయి భేటీ బచావో బేటి పడావో అని నినాదాలు ఇవ్వడానికి ప్రభుత్వాలు పనికి వస్తున్నాయి కానీ నిజంగా జరిగే దుర్మార్గాలను అరికట్టడంలో ఏమాత్రం కూడా రాష్ట్ర



కేంద్ర ప్రభుత్వాలు లేకుండా వ్యవహరిస్తున్నాయా అన్నారు. కళాశాలలో మహిళలపై ర్యాగింగ్ ఘటనలు ప్రతిరోజు చూస్తున్నాము ఇంజనీరింగ్ మెడికల్ కళాశాలలో హత్యాచారం జరుగుతున్న కానీ వాటిని పట్టించుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యంగా ప్రభుత్వాలు ఉండటం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టల్ వసతి హాస్టల్ లో ఉన్న విద్యార్థినిలకు నేర్పించండి ప్రభుత్వాన్ని కోరారు వారికి అండగా ఉంటూనే ఆడపిల్లను పుట్టనిద్దాం చదవనిద్దం కాపాడుకుందాం స్కూటీల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ వసతి గృహ లో విద్యార్థులకు ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. విధులను కేటాయించడంలో పూర్తిగా విఫలమైంది కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి కాశయ్యకరుణ చేయడం సరికాదన్నారు. అనంతరం జిల్లా కన్వెన్షన్ కమిటీ ఏకగ్రీవంగా 22 మంది సభ్యులతో కమిటీ నీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ గా పావని, జిల్లా కో కన్వీనర్ గా , శ్రావణి, కే. శివాని, జీనత్ ఫాతిమా ,సనీత, కమిటి సభ్యులు గా , మేఘన, కే. సంధ్య, సబిత ,టీ .గీతాంజలి, దివ్య, సంధ్య, సాయి ప్రియ, టీ .దుర్గా, హారిక, పూజ, గాయత్రి, నవ్య, సింధు, పూజ, భవాని, అనిత, త్రిష, సబిత, కే. పూజ, లను ఎన్నుకున్నారు .ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్రోళ్ల మహేష్, టీ .రాజేష్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా నాయకులు కె. సతీష్ , టీ. అర్జున్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



67 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులు

- పంపిణీ చేసిన కూకట్ పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, నవంబర్ 20 : కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ మండలం యం.ఆర్.ఓ కార్యాలయములో కళ్యాణ లక్ష్మి / షాదీ ముబారక్ 67 మంది లబ్ధిదారులకు చెక్కులను కూకట్ పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఆనాడు కెసిఆర్ ఎంతో మానవతా దృక్పథంతో పేద ఇంటి ఆడబిడ్డకు అండగా నేనున్నానంటూ ఈ కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకాన్ని ప్రారంభించారని దేశంలో ఎక్కడా లేనటువంటి గొప్ప పథకాన్ని ప్రారంభించి నిరుపేదలకు అండగా నిలిచినటువంటి మహోన్నత వ్యక్తి కెసిఆర్ అని గుర్తు చేసుకున్నారు ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తులం బంగారం కూడా ఇస్తుందని అబద్ధపు హామీలు చెప్పి అధికారుల్లోకి వచ్చి ఒక్క హామీ నెరవేర్చలేదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్. మందడి శ్రీనివాసరావు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికను గర్భవతిని చేసిన మైనర్ బాలుడు

- చిట్యాల లో కేసు నమోదు
- ఆసుపత్రి నిర్వహకురాలిపై కేసు

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 20: నల్గొండ జిల్లా చిట్యాల మండలం తాళ్ల వెల్లంల కు చెందిన మైనర్ బాలికను నార్కట్పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంలకు చెందిన మైనర్ బాలుడు గర్భవతిని చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్ లు తెలిపారు. చిట్యాల పీఎస్ లో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. ఇన్స్టాగ్రామ్ లో అమ్మాయితో పరిచయం ఏర్పరచుకొని ప్రేమ పేరుతో పలుమార్లు శారీరకంగా కలిశాడు. అమ్మాయి అనారోగ్యంగా ఉండడంతో తల్లిదండ్రులు ఆసుపత్రిలో చేర్పించగా గర్భవతి అని తెలుసుకున్నారు. చిట్యాల లోని సాయి తేజ ఆసుపత్రికి అబార్షన్ చేయించేందుకు బాలికను తల్లిదండ్రులు తీసుకువచ్చారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 17న ఆసుపత్రి పై పోలీసులు, ఐసీసీఎస్ వారితో కలిసి రైడ్ చేయగా మైనర్ బాలికతో పాటు చిట్యాలకు చెందిన మరో మహిళ అబార్షన్ కోసం వచ్చినట్లు గుర్తించారు. ఆసుపత్రి నిర్వహకురాలు సాంబరాజు ఆండాలు(62) పై కూడా కేసు నమోదు చేశారు. హాస్పిటల్లో సీజ్ చేసి కేసును లోతుగా దర్యాప్తు



చేయనున్నట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. మైనర్ బాలికను నల్గొండ లోని సఖి కేంద్రానికి తరలించామన్నారు. చౌటుప్పల్, నల్గొండ స్కానింగ్ సెంటర్ లపై విచారణ కొనసాగుతుందని అన్నారు. బాలికను గర్భవతిని చేసిన బాలుడు మైనర్ కావడంతోనూ, ఆస్పత్రి నిర్వహకురాలు సీనియర్ సిటిజన్ కావడంతో వారిని విలేకరుల సమావేశంలో హాజరు పరచలేదు.



నిందినితులను శిక్షించాలి

ప్రతిపక్షం బ్యూరో , రంగారెడ్డి, నవంబర్ 20: డీబీఎఫ్ అధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కు బాధిత కుటుంబ వినతిపత్రం అందజేసినారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలని,మూడు ఎకరాల భూమిని పంపిణి చేయాలని కోరారు. గ్రామంలో అలయ ప్రవేశం చేయించాలని కోరారు.ఇందుకు చైర్మన్ స్పందిస్తూ కుటుంబాన్ని అదుకొవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూమిని గుర్తించి కుటుంబానికి పంపిణి చేయాలని తహసీల్దారు ను ఆదేశించారు. డిబిఎఫ్ నాయకులు పి.శంకర్,పులి కల్పన మృతుడు బార్య వాణి,తండ్రి ఎర్ర మల్లేషం,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు



మితిమీరుతున్న హిజ్రాల ఆగడాలకు చెక్

- అమీన్ పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో 60 మంది హిజ్రాలకు కౌన్సెలింగ్
- వివాహాలు, శుభకార్యాలయాల్లో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కేసులు
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 20 : సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్‌పంకజ్ ఆదేశానుసారం అమీన్పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సుమారు 60 మంది హిజ్రాలకు అమీన్పూర్ ఎస్‌హెచ్‌ఓ నరేష్, ఇన్స్పెక్టర్ కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహాలు, శుభకార్యాలయాలు, ఇతర ప్రజా ప్రదేశాలలో ప్రజలను బయబ్రాంతులకు గురిచేస్తూ, నేర పూరిత చర్యలకు దిగుతూ ఇబ్బందులకు గురిచేస్తూ బలవంతపు డబ్బు వసూలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. చట్టానికి లోబడి, సమాజంలో అందరిలా సాదారణ జీవన విధానాన్ని అనుసరించాలని సూచించారు.జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో శుభకార్యాలయాలు, వ్యాపార సంస్థలు, ఇళ్లకు వెళ్లి ప్రజలను బయబ్రాంతులకు గురిచేస్తూ, నేర పూరిత చర్యలకు దిగుతూ బలవంతపు డబ్బు వసూలు చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కేసులు నమోదు చేయాలని ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగినట్లయితే, వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

నీటి సంరక్షణ పై భవిష్యత్తు ఆధారపడి ఉంది

- నీటి సంరక్షణ కు పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో 10 గ్రామాలు ఎంపిక

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 20 : నీటి సంరక్షణ మీదనే భవిష్యత్తు ఆధారపడి ఉందని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ అన్నారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్లో నీటి సంరక్షణ కార్యక్రమంలో భాగంగా వాటర్ హెడ్ ఎన్ జి ఓ ల ఆధ్వర్యంలో నీటి సంరక్షణ సుస్థిరమైన నీటి భవిష్యత్తు కోసం సంఘాలను సాధికారపరచడం కార్యక్రమంలో జిల్లాలో ఎంపిక చేసిన పది గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవో, ఎంపీడీవోలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ప్రారంభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవజాతి మనుగడకు నీరే ప్రధాన కారణం అన్నారు ఎక్కడైతే నీరు పుష్కలంగా లభిస్తుందో ఆ ప్రాంతాలు అభివృద్ధి పరంగా ముందు వరుసలో ఉన్నాయన్నారు. తాగునీరు,సాగునీరు ప్రస్తుతం మన ప్రాంతంలో పుష్కలంగా లభిస్తున్నప్పటికీ నీటి వృధా కారణంగా నీటిని పొదుపుగా వాడుకోకపోవడం కారణంగా తగినంత నీటిని నిలువ చేయకపోవడం కారణంగా భూగర్భ జలాల అత్యధికంగా వినియోగించడం తదితర కాలంలో భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడి సమస్య ఉందని సమస్యలు తలెత్తకుండా ఉండడం కోసం ప్రభుత్వం నీటి నిలువ ప్రాధాన్యతను ప్రజలకు వివరించడం కోసం వాటర్షెడ్ ఇలాంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టి అవ



గాహన కల్పిస్తుంది అన్నారు. మన ఊరిలో , మన ఇంట్లో కురిసిన ప్రతి వర్షపు చినుకు మనదే, మన ఇంటి ఆవరణ లో , మన ఊరి ఆవరణ భూమిలోకి ఇంకెలా చేయడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. నీటి వృధాను సాధ్యమైనంత వరకు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వర్షపు నీరు ఆధారంగా చెరువులు కుంటలు నిండి భూగర్భ జలాలు పెరుగుతున్నాయి అన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం వృధా నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించడం గ్రామంలోని మురుగు కాలువల నీటిని పెద్దపెద్ద ఇంకుడు గుంతలుఏర్పాటు చేసి భూమిలోకి ఇంకెలా చేయడం వల్ల భూగర్భ జలాలు పెంపొందించవచ్చున్నారు. చెరువులు, కుంటల లో నీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొన్ని పరిశ్రమలు వర్షం పడిన సమయంలో నీటి వ్యర్థాలను చెరువులు, కుంటలు వాగులలోకి వదిలి నీటిని కలుషితం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కంపెనీలను గుర్తించి పంచాయతీ కార్యదర్శి ఆ కంపెనీలకు నోటీసులు ఇవ్వడం కఠిన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎంపిక చేసిన పది గ్రామాలలో ప్రభుత్వ విద్యా సంస్థలు, ప్రభుత్వ వసతి గృహాలు,ప్రభుత్వ కార్యాలయంలో నీటి వసతి కల్పించడం, నీటి వృధాను అరికట్టడం, ఆయా గ్రామాల ప్రజలకు నీటి పొదుపుగా వాడుకునేలా చూడడం భూగర్భ జలాల పెంపు కోసం నీటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవడం పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి భవిష్యత్తులో తాగునీరు సాగునీరు కోసం ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలంటే ఇప్పటినుంచే నీటిని సంరక్షించాలన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మల్కాపూర్, గుంతపల్లి, హరిదాస్పూర్, బాచుపల్లి, మన్నాన్పల్లి, గొల్లపల్లి, మారేపల్లి, కొండాపూర్, మహమదాపూర్ ఇతర 10 గ్రామాలను జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి నీటి సంరక్షణకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డి ఆర్ డి ఓ బాలరాజు, భూగర్భ జల అధికారి డా. జి. మోహన్,డిప్యూటీ డైరెక్టర్, డి పి ఓ సాయి బాబా, కార్ల్‌స్‌బర్గ్ మిస్టర్ సీసీ అల్పట్ బ్రూవరీ హెడ్, గ్రౌండ్ వాటర్ వాటర్ ఎయిడ్ సునీల్ కుమార్, సీనియర్ టెక్నికల్ అడ్వైజర్, వాటర్ ఎయిడ్ ఆల్విన్ మనీష్ షా, వాటర్ ఐడ్ జిల్లా ఇంచార్జ్ శ్రీనివాసరావు, ఎంపీడీవోలు ఏపీవోలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కొత్త ప్రభుత్వం బిహార్ ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తుందని ఆకాంక్షిస్తున్నా. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన నితీశ్, కొత్తగా మంత్రులైన సభ్యులు అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. బీహార్ లో నూతనంగా ఏర్పడిన ఈ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందని ఆశిస్తున్నాను.

- ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్

ప్రాంతీయం

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకపోతే చర్యలు తప్పవు
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి



ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 20: పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎదిగే పిల్లలయినందున వారికి సరైన పౌష్టికాహారం అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, పప్పు, కాకరకాయ, సాంబారు, గుడ్డు వండినట్లు వంట సిబ్బంది తెలపారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. నాణ్యతను మెరుగు పరచాలని చెప్పారు. పప్పులో ఆకుకూరలు వేసి రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. బాలికలు ఎదిగే పిల్లలనీ, సరయిన పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ప్రతిరోజు విద్యార్థులకు నెయ్యి పెట్టాలని సూచించారు. కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు నెయ్యి వడ్డించారు. విద్యాలయంలో 260 గాను 230 మంది విద్యార్థులు హాజరయ్యారని ఈ సందర్భంగా కేజీబీవీ ప్రత్యేక అధికారి కలెక్టర్ కు తెలిపారు. సంఖ్యకు అనుగుణంగా మెనూ ప్రకారం ప్రకారం వంట సరుకులు అందించినట్లు తెలిపారు. కామన్ డైట్ మెనూ పాటించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. కూరగాయలు దొరకట్లేదని సాకులు చెప్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రిజిస్టర్ లు తనిఖీ చేశారు. రిజిస్టర్ రాయడంలో జాప్యం చేయవద్దని చెప్పారు. కేజీబీవీలో ప్రత్యేకాధికారి నుంచి నుండి వంట సిబ్బంది వరకు ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలకు తరుచూ ఆరోగ్య పరీక్షలు చేయాలని చెప్పారు. హిమోగ్లోబిన్ శాతం చెక్ చెయ్యాలని సూచించారు. హిమోగ్లోబిన్ శాతం తగ్గిన వారికి కొత్త డైట్ అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే దగ్గరలోని ప్రాంతీయ ఆసుపత్రికి పంపించాలని ఏఎన్ఎం ను ఆదేశించారు.



మత్స్యకారుల బతుకులను ఆగం చేసిన రేవంత్ రెడ్డి

- ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 20: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు నమ్మి మత్స్యకారులు ముదిరాజులు ఓట్లు వేస్తే గత రెండు సంవత్సరాలుగా ఉచిత చేప పిల్లలు ఇవ్వకుండా ముదిరాజ్ మత్స్యకారుల బతుకులను ఆగం చేసిందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మండిపడ్డారు. గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మేడికాయల వెంకటేశం, కీసరి పాపయ్యలు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్, హరీష్ రావు మత్స్యకారులకు వందశాతం ఉచిత చేప పిల్లలు ఇచ్చి ముదిరాజులను ఆదుకున్నారన్నారు. నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారం కోసం మత్స్యకారులకు చేప పిల్లలు, సబ్సిడీ పరికరాలు ఇస్తానని ముదిరాజులను బీసీ ఏ లోకి మారుస్తానని కామారెడ్డిలో నమ్మబలికి అధికారం చేపట్టినాక మత్స్యకారుల, ముదిరాజుల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిరాజ్ మత్స్యకారులకు రావాల్సిన ఉచిత చేప పిల్లలు ఇవ్వకపోవడంతో వారి జీవనం అగమ్యగోచారంగా మారిందన్నారు. ఇప్పటికైనా ముదిరాజ్ మత్స్యకారులపైన దృష్టి పెట్టి తమకు అందాల్సినరిజర్వేషన్లు, ఉచిత చేప పిల్లలకు ఇవ్వాల్సిన డబ్బులు నేరుగా మత్స్య సొసైటీలోకి నగదు బదిలీ చేసి సబ్సిడీ పరికరాలను అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే సర్పంచ్ ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పడిగే ప్రశాంత్, సుతారి రాజు, టైగర్ సతీష్, జెట్టి రాజేష్, పెండేలా బాలయ్య, యాట రాజేష్, సిద్ధరబోయిన శ్రీనివాస్, కొత్త శంకర్ చెరుకు నారాయణ తదితరులు ఉన్నారు.



జిల్లా కారాగారాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 20: సిద్దిపేట అర్బన్ మండలంలోని ఏన్సాన్ పల్లి గ్రామ శివారులో దాదాపు 34 ఎకరాల విస్తీర్ణం లో 78 కోట్లతో నిర్మించిన జిల్లా కారాగాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. దాదాపు కారాగారం పూర్తినట్లుగా సబ్ జైలర్ఎస్ఐ వికాస్, ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ కు తెలిపారు. కేంద్రీయ విద్యాలయ పక్కన నుండి కనెక్టివిటీ అప్రోచ్ రోడ్డు వేసేందుకు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్, పంచాయతీ ఇంజనీర్ శాఖ అధికారులతో చర్చించడం కోసం పాత దస్త్రాలతో తన వద్దకు రావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 20: సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై జక్కాపూర్ గ్రామ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సిరిసిల్ల జిల్లా మండపల్లికి చెందిన ద్విచక్ర వాహనదారుడు తిరుపతి అక్కడికక్కడే మృతి చెందగా ఆయన భార్య రజిత కు తీవ్రగాయాలు అయ్యాయి. ఎదురుగా వేగంగా వస్తున్న కారు, అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ఈ విషాదం చోటు చేసుకుంది. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు వెనుక వస్తున్న ఒక వాహనంలోని డాష్ కెమెరాలో స్పష్టంగా రికార్డయ్యాయి. సిద్దిపేటలో బంధువులు చనిపోవడంతో బైక్ పై భార్యాభర్తలిద్దరూ బయలుదేరారు. హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు హరికృష్ణ అనే వ్యక్తి కారును డ్రైవింగ్ చేసుకుంటూ స్పీడ్ గా వెళ్లి రాంగ్ రూటు లో బైకును ఢీకొనడంతో బైక్ పై ఉన్న తిరుపతి (49) అక్కడికక్కడే మృతి చెందగా అతని భార్య రజిత (40) తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



కోటిలింగాలయంలో కార్తీక వనభోజనాలకు భక్తుల రద్దీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 20: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కోటిలింగాల స్వామి దేవస్థానంలో భక్తుల సందడి నిండుకుంది. ప్రత్యేకంగా ఉసిరి చెట్ల కింద నిర్వహించే కార్తీక వనభోజనాలు కోసం గురువారం వేలాది మంది భక్తులు ఆలయ ప్రాంగణానికి తరలివచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి భక్తులు వనం మధ్య భోజనం చేస్తూ భక్తి పరవశంలో పాల్గొన్నారు. ఉసిరి చెట్టును ధాత్రి చెట్టుగా పరిగణించి, క్షమించే గుణానికి ప్రతీకగా భావిస్తారు. లక్ష్మీదేవి స్వరూపంగా భావించే ఈ చెట్టు కింద వనభోజనం చేస్తే పాపాలు నశించి, సకల దోషాలు తొలగిపోతాయని పురాణాలు పేర్కొంటాయి. విష్ణుమూర్తిని అర్పించి వనభోజనం చేస్తే కుటుంబానికి శాంతి, సంపద కలుగుతుందని భక్తుల విశ్వాసం.అలాగే కార్తీక మాసంలో దీపారాధన, స్నానదానాలు, వనం వాసం వంటి సంప్రదాయాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండటంతో కోటిలింగాల ప్రాంతం యావత్ మాసం భక్తులతో కిటకిటలాడుతోంది. దేవస్థానం అధికారులు భక్తుల రాకను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



గంగిరెద్దుల వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

- సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటికి వినతి

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 20: తెలంగాణ రాష్ట్ర గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిడ్డి కనకన్న నేతృత్వంలో సంఘ రాష్ట్ర కమిటీ బృందం గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో గంగిరెద్దులకి స్థిర నివాసాలు లేవని, వారికి ఇంటిస్థలాలు చూపించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సంఘ ప్రతినిధులు మంత్రికి వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, తన వంతు సహాయ సహకారాలు అందించడంతో పాటు ఈ విషయాన్ని ముఖ్యమంత్రితో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గంగిరెద్దుల సంఘం అధ్యక్షులు జిడ్డి కనకన్న, నాయకులు ఎం. మల్లేశం, జె. సారయ్య, సంఘ గౌరవ అధ్యక్షులు టీచర్ వెంకన్న పాల్గొన్నారు.



వీరభద్ర స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట నవంబర్ 20: చిన్నకోదూరు మండల కేంద్రంలో పవిత్ర కార్తీక మాసం సందర్భంగా గురువారం వీరభద్ర స్వామి ఆలయంలో దీపాలు వెలిగించి మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కార్తీక మాస దీపోత్సవ కార్యక్రమం ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. గుడి ఆవరణంలో ఓం ఆకృతిలో దీపాలు వెలిగించారు. స్వామి వారి ఆశీస్సులతో చిన్న కోడూరు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. అనంతరం గుడి ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టు కింద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పానుగంటి శారదా, ప్రేమలత, స్వప్న జయ, ఏదులలక్ష్మి,వైష్ణవి,దీప,లక్ష్మి మౌనిక,రజిత,మాధవి, కనకతార, భక్తులు, గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 72 మంది ఎంపిక

- కోచ్ కరణం గణేష్ వెల్లడి

ప్రతిపక్షం, చేగుంట ,నవంబర్ 20: చేగుంట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలలో సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకళ ఫెన్సింగ్ క్రీడలను ప్రారంభించారు. అండర్ 14,17,19 క్రీడలలో బాల బాలికలు పాల్గొన్నారు. అండర్ 14 విభాగంలో గెలుపొందిన క్రీడాకారులకు ఈనెల 21,22,23 తేదీలలో మహబూబ్ నగర్ జిల్లా నెల్లికుదురు జిల్లా పరిషత్ హైస్కూల్ లో క్రీడలు కొనసాగుతాయని కోచ్ కర్ణం గణేష్ రవికుమార్ తెలిపారు. అండర్ 17 విభాగంలో పాల్గొనే క్రీడాకారులకు ఈనెల 23,24, 25 తేదీలలో నెల్లికుదురు పాఠశాలలో క్రీడలు కొనసాగుతాయని తెలిపారు. అలాగే అండర్ 19 విభాగంలో పాల్గొనే క్రీడాకారులకు 22,23,24 తేదీలలో ఆ పాఠశాలలో కొనసాగుతాయన్నారు. ఈ క్రీడా కార్యక్రమంలో ఫెన్సింగ్ రెఫరీలు కరణం మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పరమేశ్వరుడి రూపం.. చుట్టూ దీపాలంకరణ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 20: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల గర్భగుడి ముందర ఉన్నమండపంలో గురువారం కార్తీకమాసం అమావాస్య చివరిరోజు సందర్భంగా పరమేశ్వరుని రూపం ఆకట్టుకుంది.పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పరమేశ్వరుడి రూపం చుట్టూ దీపాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఏడుపాయలలో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసం చివరి అమావాస్య సందర్భంగా భక్తులు మంజీరా నది స్నానం ఆచరించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



గోవు ఆకారంలో ప్రమిదలు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 20: కార్తీక మాసం చివరి రోజు కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం వద్ద గురువారం హిందూ సంస్కృతి, సాంప్రదాయం పరంగా "గావో విశ్వస్య మాతరః" అంటూ గోమాతను పూజించడంతో పాటు దేవస్థానం ఎదురుగా గోవు ఆకారంగా గోశాల వద్ద ఏర్పాటు చేసిన దీప ప్రమిదలను భక్తులు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీందర్ గుప్తా, మరియు ధర్మకర్తలు, ఆలయ కార్యనిర్వాహణాధికారి విజయ రామారావు, సహాయ అధికారి సుధాకర్, సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్

- వ్యాపారులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు



ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 20 : సిద్దిపేట పట్టణంలో ఫుట్ పాత్ ఆక్రమణలను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. హాస్పిటల్ రైతు బజార్, బిట్టర్ చౌరస్తా రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఫుట్ పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులకు ఈ సందర్భంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, పట్టణంలోని వ్యాపారస్తులు ఫుట్ పాత్‌లను ఆక్రమించడం వల్ల నడుచుకుంటూ వెళ్లే ప్రజలకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. ఫుట్ పాత్‌లు, రోడ్లపైకి సామాన్లు, ప్రకటన బోర్డులు ఉంచి వ్యాపారం చేయవద్దని హెచ్చరించారు. మున్సిపల్ , మార్కెట్ నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు. వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు మాట్లాడుతూ, ఫుట్ పాత్‌లు ప్రజల కోసం నడవడానికి ఉద్దేశించినవని, వాటిని ఆక్రమించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అవగాహన కల్పించిన తర్వాత కూడా మార్పు రాకపోతే, ఫుట్ పాత్‌లను ఆక్రమించిన వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. సిద్దిపేట పట్టణంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు భాగంగా చేపట్టిన ఈ డ్రైవ్‌కు ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని ట్రాఫిక్ విభాగం విజ్ఞప్తి చేశారు.



రాష్ట్రంలో రేవంత్, కేటీఆర్ పాలన నడుస్తోంది. ఫార్ములా ఈ- కార్ రేసు కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు ఇంతకాలం గవర్నర్ అనుమతి ఇవ్వడం లేదని కేంద్రాన్ని టార్గెట్ చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ ఏం చేస్తారో, ఏం చెప్తారో చూడాలి. రేవంత్, కేటీఆర్ దోస్తానా ఇప్పుడు బయటపడుతుంది.
- కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రాంతీయం



విజ్ఞాన భాండాగారం గ్రంథాలయాలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 20: గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానవంతులు కావాలని, చిన్నప్పటినంచే విద్యార్థులు గ్రంథాలు చదవడం అలవరచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. 58వ గ్రంథాలయ దినోత్సవ వారోత్సవ ముగింపు సమావేశాలు సిద్దిపేట జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ అత్యాధునికంగా గ్రంథాలయాలను అందుబాటులో తెస్తామన్నారు. విద్యార్థులు అన్నిరంగాలలో రాణించాలని, ఇష్టంగా చదువుతూ ముందుకు సాగాలన్నారు. వినూత్న ఆలోచనలతో నూతన ఒరవడి సృష్టించాలన్నారు. కవి చొప్పదండి సుధాకర్ మాట్లాడుతూ సంస్కారవంతమైన జీవితానికి గ్రంథాలయాలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థుల ప్రతిభ దాగదని, చిత్రలేఖనం, వ్యాసరచన, సుడోకో, జీకే, ముగ్గుల పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు. విద్యాశాఖ సూపరెండెంట్ రాజేశ్వరి, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం, న్యాయవాది మనోహర్, మామిడాల స్రవంతి, గ్రంథపాలకులు కె.రాజు, దాసరి రాజు, శ్రీనివాస్, ముజఫర్, మల్లయ్య, సాయి, హరి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌తో 'హిడ్మా'కు కనెక్షన్

- దినసరి కూలీగా పనిచేసిన హిడ్మా
- గౌరవెల్లి ప్రాజెక్టు పనుల్లో కూలీల రూపంలో పని
- కూలీగానే.. పార్టీ రహస్య కార్యకలాపాలు
- హుస్నాబాద్ లో అరెస్ట్, రిమాండ్ చేసిన పోలీసులు





ప్రతిపక్షం బ్యూరో, ఉమ్మడి కరీంనగర్ నవంబర్ 20: హిడ్మా మావోయిస్టు పార్టీలో చేరినప్పటి నుంచి దళంలో అత్యంత వేగంగా ఎదిగిన వ్యక్తి అనే పేరుంది. అయితే ఆయన జీవితంలో, వ్యూహాల్లో ఆందరికి తెలియని ఒక కోణం ఉంది. తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రస్తుతం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ తో మంచి సంబంధం ఉంది. ఈ ప్రాంతంలో కొన్ని సంవత్సరాలు గడిపిన కోణం వెలుగు చూస్తుంది. ఆయనకు ఉన్న అనుబంధం పదేండ్ల క్రితం సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ లో ఒక సాధారణ కూలీలా తిరిగాడు. అప్పట్లో ఈ ప్రాంతానికి చెందిన మావోయిస్టు నేతలు, కేంద్ర కమిటీ సభ్యులతో మంచి సంబంధాలు ఉండేవని తెలుస్తోంది. ఇక్కడి నుండి ఉత్తర తెలంగాణ ప్రాంతం (ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాలు)లలో అప్పట్లో పార్టీ ని బలోపేతం చేయడం లో హి డ్మా కీలక పాత్ర పోషించాడని కొత్త కోణం వెలుగు చూస్తోంది. ఆ సమయంలో ఇక్కడ జరుగుతున్న గౌరవెల్లి ప్రాజెక్టు టన్నెల్ పనుల్లో కూలీల రూపం లో మావోయిస్టులు చొరబడ్డారని నిఘావర్గాల హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నిఘా బృందాలు అనుమానితులను అదుపులోకి తీయడాని ప్రశ్నించగా, అందులో హిడ్మా కూడా ఉన్నారు. అతని భాష పోలీసులకు సరిగా అర్థం కాలేదు. అతని వద్ద దొరికిన స్మార్ట్ ఫోన్ లోని కొన్నివీడియోలు చూసి పోలీసులు ఖంగు తిన్నారు. వెంటనే అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్ పంపారు. ఆ తర్వాత బెయిల్ పై విడుదలైన హిద్మా తిరిగి చత్తీస్గడ్ వెళ్లిపోయాడు. హుస్నాబాద్లో కూలీగా వ్యవహరిస్తూనే ఆయన పార్టీ రహస్య కార్యకలాపాలు పూర్తి చేశాడనే విషయం పోలీసులకు తర్వాత అర్థమైంది. ఎవరికీ అనుమానం రాకుండా ప్రణాళికలను అమలు చేయడంలో, పార్టీని విస్తరిం చడంలో హిడ్మాకున్న పట్టుకు ఈ సంఘటన ఒక నిదర్శనం.



జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పొదుపుతో అధిక వడ్డీ

- ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ సదానందం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 20: సిద్దిపేట జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు చేస్తే అన్ని బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీని పొందవచ్చునని ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ సదానందం అన్నారు .చిన్నకోడూరు మండల పరిధిలో గల అల్లీపూర్ సొసైటీ లో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్యాంకు మేనేజర్ రమేష్ సొసైటీ డైరెక్టర్స్ తో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ... సహకార వారోత్సవాలలో భాగంగా బ్యాంకులో నూతనంగా "స్వర్ణనిది డిపాజిట్" డిపాజిట్ పథకం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు.ఈ పతాకం ద్వారా 444 రోజులకు గాను అత్యధికంగా 8.25 శాతము వడ్డీని పొందవచ్చు అన్నారు. డిపాజిట్లపై డిఐసిజిసి ఇన్సురెన్స్ సదుపాయం తో పాటు కస్టమర్స్ కి పిఎంజెజెబివై, పిఎంఎస్బి వై ఏటిఎం,యూపీఐ ,మొబైల్ బ్యాంకింగ్ ,బ్యాంకు గ్యారంటీ, లాకర్ సౌకర్యాన్ని అందిస్తున్నాం అన్నారు .అతి తక్కువ వడ్డీకి గృహ రుణాలు ,వ్యాపార రుణాలు ,స్వల్పకాలిక రుణాలు, దీర్ఘకాలికా రుణాలు ఇస్తున్నాం అని తెలియ చేసారు .బంగారు ఆభరణాలపై అతితక్కువ వడ్డీకి అత్యధికంగా గ్రాము కి 7400 రుణాన్ని అందిస్తున్నాము అని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు .



ఏఐసీసీ సెక్రెటరీని సన్మానించిన మంత్రి వివేక్

ప్రతిపక్షం, హైదరాబాద్, నవంబర్ 20: ఏఐసీసీ సెక్రెటరీ, తెలంగాణ ఇంచార్జీ సచిన్ సావంత్‌ను గురువారం రాష్ట్ర కార్మికశాఖ ఉపాధి గనులశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి జుబ్లీహిల్స్ విజయానికి సంబంధించిన విషయాలను వెల్లడించారు. అంతేగాకుండా గత బీఆర్ఎస్ పాలనలో ఫార్ములాఈ రేస్ కు గవర్నర్ అనుమతిచ్చారంటే దానికి సంబంధించిన అంశాలపై చర్యలు తీసుకోవాలని స్పష్టంగా అందులో పేర్కొనబడిందని తెలిపారు. తప్పులు చేసి రాజకీయ కుట్రలు చేస్తున్నట్టు ఆరోపణలు చేయడం సరైందికాదని ఆరోపించారు. ఈ ఫార్ములా ఈ కార్ రేస్‌కు సంబంధించి కేటీఆర్ దోషిగా తేలితే శిక్ష తప్పదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి కట్టుబడి పని చేస్తున్నారని తెలిపారు. పార్టీ సిద్ధాంతంతో పాటు ప్రజా సంక్షేమమే తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడ కాంగ్రెస్ పార్టీ విజయం కాయమని తెలిపారు.



అన్ని హంగులతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సిద్ధం చేయాలి

- ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ - కె. హైమావతి

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 20: ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అన్ని హంగులతో త్వరితగతిన పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లను ఎలాంటి సమస్యలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో రూ. 300కోట్లతో నిర్మాణం చేస్తున్న ఆయిల్ పామ్ ప్యాక్టరీని గురువారం పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యాక్టరీ లోపల బీటీ రోడ్, డ్రైనేజీ నిర్మాణాల వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రహదారి వెంబడి చెట్ల పొదలు తొలగించాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు వివిధ జిల్లాల నుండి తరలివచ్చే ప్రజల వాహనాలను నిలిపేందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. వాహనాలను నిలిపేందుకు ఫ్యాక్టరీ పక్కన గల టీజీఐఐసీ స్థలన్ని చదును చెయ్యాలని తెలిపారు. వీఐపీ వాహనాలను నిలిపేందుకు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించాలని చెప్పారు. ముఖ్యమంత్రి ఫ్యాక్టరీ ప్రారంభం కోసం వచ్చే హెలికాప్టర్ దిగేందుకు అవసరమైన హెలిప్యాడ్ సిద్ధం చేయాలని రహదారులు భవనాల అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ఫ్యాక్టరీ ప్రారంభానికి సంబంధించిన పనులను పక్కా ప్రణాళికలతో పగడ్బందిగా సిద్ధం చేయాలని ఆయిల్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రారంభానికి ఫ్యాక్టరీని సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి, ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ ఇంజనీర్ శ్రీకాంత్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఏడుపాయల హుండీ ఆదాయం 29 లక్షలు

- శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 20:- తెలంగాణలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయం ఆలయ ఈవో, దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ సులోచన, మెదక్ ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ సహకారంతో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 101 రోజులకు గాను హుండీ ఆదాయం 29 లక్షల 92 వేల 712 రూపాయలు రావడం జరిగిందని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఆలయం గత కొన్ని రోజులు భారీ వర్షాలు పడడం సింగూరు డ్యామ్ నుండి నీటిని వదలడంతో ఆలయం గత కొన్ని రోజులు భారీ వర్షాలు పడడం సింగూరు డ్యామ్ నుండి నీటిని వదలడంతో ఆలయ మూసివేయడం జరిగిందని. దీంతో చాలా రోజులపాటు రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించడం జరిగిందని. ఆయన తెలిపారు గురువారం. 101 రోజులపాటు గుండె లెక్కింపు వేయడం జరిగిందని ఆయన తెలిపారు.



అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రేపటి నుంచి జిల్లాలో నిర్వహించబోయే బాలికల అండర్ 14, అండర్ 16 ఖేలో ఇండియా ఖేలో ఇండియా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు రేపటి నుంచి నిర్వహించనున్నారు. ఈ ఎంపిక పోటీలకు సంబంధించి గోడప్రతులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం సాయంత్రం తన ఛాంబర్లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్యాముల్, ఎస్జిఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, గిరిప్రసాద్, తదితరులు ఉన్నారు. ప్రతిపక్షం, నిర్మల్

విషాదాంతమైన ప్రేమ పెళ్లి

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



ప్రతిపక్షం, గజ్వేల్(జగదేవ్పూర్), నవంబర్ 20: ఐదు నెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్న యువతి అనుమానాస్పద పరిస్థితుల్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగదేవపూర్ మండలం అలిరాజపేటలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గజ్వేల్ మండలం చిన్న ఆరేపల్లికి గ్రామానికి చెందిన సదా అఫ్రీన్ (21), జగదేవపూర్ మండలం, అలిరాజపేట గ్రామానికి చెందిన ఫరీద్(22) అనే యువకుడు ఇద్దరు డిగ్రీ చదువుకున్న రోజుల్లో ఒకరినొకరు ప్రేమించుకున్నారు. వీరు గత ఐదు నెలల క్రితం ప్రేమపెళ్లి చేసుకున్నారు. వివాహం అనంతరం భార్యాభర్తలు అన్యోన్యంగా జీవితం కొనసాగించారు. అంతలోనే ఏం జరిగిందో తెలియదు కానీ ఇంట్లో ఎవరూ లేని వేళ యువతి గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచ నామా తరువాత పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సదా అఫ్రీన్ మృతికి వరకట్న వేధింపులే కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




అంగన్వాడి సమస్యలపై 'దిశ' సమావేశంలో చర్చిస్తాం

- దిశ కమిటీ మెంబర్ రవీందర్ రెడ్డి


ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 20: పాఠశాలల అంగన్వాడి సమస్యలపై దిశ కమిటీ దృష్టికి తీసుకెళ్లి, కమిటీ సమావేశంలో చర్చించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని జిల్లా దిశా కమిటీ మెంబర్ రవీందర్ రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట అంగన్వాడి సెంటర్లను, ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిధులను మొదటి ప్రాధాన్యత విద్యపై ఖర్చు చేసి, విద్యాభివృద్ధికి కృషి చేసే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. దొమ్మట ప్రాథమిక పాఠశాలకు గేటు లేకపోవడం వల్ల పాఠశాలలో మద్యం సేవించడం, చింతపండు, మిరపకాయలు మామిడి తరుగు, ఆరబెట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకునే పాఠశాలలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. పాఠశాలకు గేటు నిర్మించే విధంగా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. రవీందర్ రెడ్డి అంగన్వాడి కేంద్రాలు రంగులువేయడానికి రూ. 2 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దేవుడి లావణ్య నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్ రావు, బీజేపీ కార్యకర్తలు శ్రీకాంత్ గౌడ్, కృష్ణ, సురేష్, భాస్కర్, స్వామి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయాల నమోదులో జాప్యం లేకుండా చూడాలి

- సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి



ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 20: ధాన్యం కొనుగోలు అనంతరం రైతుల వివరాలను నమోదు చేయడంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మెట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం సిబ్బందితో మాట్లాడారు. రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం డబ్బుల చెల్లింపు వివరాలను ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల వివరాలను ట్యాబ్ లో నమోదు చేయడంలో జాప్యం కాకుండా చూసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎంను ఫోన్ లో ఆదేశించారు. కొనుగోలు చేసిన వడ్లను లారీలలో అంక్షాపూర్ లోని ఉమామహేశ్వర బియ్యం మిల్లు, ముండ్రాయిలోని శ్రీనివాస్ బియ్యం మిల్లులకు పంపిస్తున్నట్లు కొనుగోలు కేంద్రం సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. రైతులు వాతావరణ శాఖ సూచనలు పాటించాలని తెలిపారు. అకాల వర్షాలు కురుస్తాయని, రాత్రి సమయంలో రైతులు ధాన్యం రాశులపై టార్పాలిన్ కవర్లు కప్పుకోవాలని సూచించారు. తేమశాతం రాగానే వెంటనే గోనె సంచులలో నింపి లారీల్లో లోడ్ అయ్యేలా పని చేయాలని కొనుగోలు కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి, ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ ఇంజనీర్ శ్రీకాంత్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఫార్ములా ఈ-కార్ రేసును పూర్తి పారదర్శకతతో నిర్వహించాం. కేటీఆర్ పై కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ఠ ఇది. ప్రశ్నించే గొంతులను సీఎం రేవంత్ నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టాలనుకుంటున్నారు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ అండగా ఉంటుంది. రేవంత్ దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటాం.
- మాజీ మంత్రి హరీశ్ రావు

రాజన్న ఆలయంలో భారీగా అంతర్గత బదిలీలు

- గందరగోళంలో ఆలయ ఉద్యోగులు
- 17 మంది ఉద్యోగులను బదిలీ చేసిన ఈఓ



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 20: ఇద్దరు ఏఈవోలు, నలుగురు సూపర్డెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు ఇద్దరు, జూనియర్ అసిస్టెంట్లు ఏడుగురు, ఒకరు రికార్డ్ అసిస్టెంట్, మరొకరు అటెండర్ ఏవో రమాదేవి అంతర్గత బదిలీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు వారి వారి స్థానాల్లో చార్జీలు తీసుకోవాలని, లేకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్న ఆలయ ఈవో రమాదేవి హెచ్చరించారు. సెంట్రల్ గోదాం సూపర్డెంట్ గా పనిచేసిన వెంకట ప్రసాద్ రాజు ను బదిలీ చేసి అదే ప్లేస్ లో సూపర్డెంట్ సంతోష్ కు ఇచ్చారు. మూడు రోజుల్లో సెంట్రల్ గోదాం లో ఉన్న సరుకులను వెచ్చించి సంతోష్ కు చార్జ్ ఇవ్వాలని వెంకటప్రసాద్ రాజును ఈవో ఆదేశించారు.

కారణం ఇదేనా..?

వేములవాడ పట్టణానికి చెందిన గోవింద్ అభినవ్(25) అనే యువకుడు అనుమానాస్పద మృతి చెందారు. రెండవ బైపాస్ రహదారిలోని బుధవారం అర్ధరాత్రి మురికి కాల్వలో పడి మృతి చెందినట్లుగా సమాచారం. మృతుడు బద్ది పోచమ్మ ఆలయంలో దినసరి కార్మికుడిగా కొంతకాలంగా పనిచేస్తున్నారు. ఇటీవలే రాజన్న ఆలయంలో ఆలయ గోదాం నుండి సరుకులను సదరు విభాగం పర్యవేక్షకుడి వాహనంలోకి తరలించారు. గోదాం సరుకుల తరలింపు వ్యవహారంలో ఇప్పటికే అనేక మలుపులు తిరుగుతుండగా తరలించిన వ్యక్తి ఆకస్మిక మృతిపై అనుమానాలు సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు విచారిస్తున్నారు. ఈ క్రమంలో ఈ బదిలీ లు జరిగి ఉండవచ్చని పలువురు బావిస్తున్నారు.



బొగ్గు నాణ్యతలో మందమర్రికి మూడో బహుమతి

- ఇదీ సమిష్టి విజయం: జీఎం రాధాక్రిష్ణ

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, నవంబర్ 20: సింగరేణిలో ఇటీవల నిర్వహించిన బొగ్గు నాణ్యత ప్రమాణాలలో మందమర్రి ఏరియా మూడో బహుమతి సాధించింది. ఈ సందర్భంగా బహుమతిని సింగరేణి సీఎండీ చేతుల మీదుగా జీఎం రాధాక్రిష్ణ, క్వాలిటీ మేనేజర్ ప్రదీప్ కుమార్ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ బల్‌రాం మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా 12 ఏరియాల్లో మూడో బహుమతి సాధించడం గొప్ప విషయమన్నారు. మార్కెట్‌లో నాణ్యమైన వస్తువులకే మంచి రేటు ఉంటుందని, మన బొగ్గుకు అదే రేటు లభించాలంటే నాణ్యత ప్రమాణాల్లో అందరూ కృషి చేయాలని కోరారు. పోటి ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే నాణ్యతతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈసందర్భంగా మందమర్రి క్వాలిటీ డిపార్టుమెంటును, అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మందమర్రి జీఎం రాధాక్రిష్ణ మాట్లాడుతూ ఇది అందరి సమిష్టి విజయమని తెలిపారు. ఈ అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. అదే విధంగా మొదటి స్థానంలో నిలిపేందుకు అందరూ కంకణ బద్ధులై పని చేయాలని కోరారు.



ఎల్లమ్మ దేవాలయ భూమిపై విచారణ

- అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 20: హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ దేవాలయి భూ వివాదంపై దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ సంధ్యారాణి గురువారం విచారణ జరిపారు. ఈ సంర్భంగా సిద్దిపేట జిల్లా ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మితో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, దేవాలయానికి సంబంధించిన సర్వే నంబర్ 265లోని 4 ఎకరాల 4 గుంటల భూమిపై విచారణ చేపట్టారు. భూమి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. దేవాదాయ భూముల పరిరక్షణ, సక్రమ వినియోగంపై ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిని ఉప కమిషనర్ సమీక్షించారు. నిర్మాణంలో ఉన్న పనుల నాణ్యత, పురోగతిపై ఆరా తీశారు. పనులను వేగవంతం చేయాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా ఆమె ఆదేశించారు. ఎల్లమ్మ దేవాలయ కార్యనిర్వహణాధికారి కిషన్ రావు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారుల సూచనలు, సలహాల మేరకు పనులను మరింత వేగవంతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆకుల వెంకన్న, పూదరి లక్ష్మీనారాయణ గౌడ్, పున్నసది, చిత్తారి రవీందర్, వడ్డేపల్లి రమణ, పూదరి శ్రీనివాస్ గౌడ్, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, షర్ఫుద్దీన్, పెరుమాండ్ల నర్సాగౌడ్, పూదరి చంద్రమౌళి గౌడ్, పూదరి వరప్రసాద్ గౌడ్, మరియాల రాజిరెడ్డి పాల్గొన్నారు. దేవాలయ సిబ్బంది తాటికొండ పరమేశ్వర్ శర్మ, అర్చకులు నీల కుమారస్వామి, హనుమంతు, గీకూరు రమేష్, రాజయ్య, వీర రాజు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలను

పరిశీలించిన అదనపు కలెక్టర్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 20: హసన్ పర్తి మండలం మడిపల్లిలో, భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి గురువారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది, ఎంతమంది రైతుల నుండి దాన్యం కొనుగోలు చేశారనే వివరాలను నిర్వాహకులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం బస్తాల తూకాలను పరిశీలించారు. మడిపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల, గట్ల నర్సింగాపూర్ లోని ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా వండిన భోజన పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా భీమదేవరపల్లి తహసిల్దార్ రాజేష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నూట యాభై మస్టర్ల సర్క్యులర్ జారీ

- హాజరు శాతం తగ్గడంతో యంత్రాలు ఖాళీగా ఉండి బొగ్గు ఉత్పత్తి పై ప్రభావం
- జీడీకే 2వ ఇంక్లైన్ గేట్ మీటింగ్ లో ఏఐటీయుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య.

ప్రతిపక్షం, గోదావరిఖని, నవంబర్ 20: సింగరేణిలో నలబై శాతం మంది కార్మికులు విధులకు హాజరు కావడం లేదని హాజరు శాతం తగ్గించేందుకు యాజమాన్యం నూట యాభై మస్టర్ల సర్క్యులర్ ను జారీ చేసిందని, దీనిని విధులకు రెగ్యులర్ గాహాజరయ్యే వారికి మినహాయింపు ఇవ్వాలని ఈ నెల 10న జరిగిన స్ట్రక్చర్ సమావేశం లో యాజమాన్యం కు సూచించడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె 2వ ఇంక్లైన్ లో జరిగిన గేట్ మీటింగ్ లో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి లో ప్రతి రోజు నలబై శాతం మంది కార్మికులు విధులకు హాజరు కావడం లేదని దీని వల్ల బొగ్గు ఉత్పత్తి పై ప్రభావం చూపడం వల్ల క్రమ శిక్షణ చర్యల కింద ఇట్టి సర్క్యులర్ ను జారీ చేయడం జరిగిందని యాజమాన్యం మొన్న జరిగిన సమావేశంలో పేర్కొందని ఆయన అన్నారు. ఇట్టి సర్క్యులర్ వల్ల రెగ్యులర్ గా విధులు నిర్వహించే వారిని కూడా నెలలో 16/20 మస్టర్లు చేయలేదని వారు తమ కుటుంబ సభ్యుల తో కలిసి కౌన్సిలింగ్ కు రావాలని యాజమాన్యం నోటీసు బోర్డులో పేర్కొనడం తో చాలా మంది కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారని దీనిని ఏఐటీయుసి తీవ్రంగా వ్యతిరేకిస్తూ 16/20 కౌన్సిలింగ్ విధానం రద్దు చేయాలని కోరడం తో యాజమాన్యం అంగీకరించి ఒత్తిడి చేయమని హామీ ఇచ్చారని ఆయన అన్నారు. అదేవిధంగా స్వంత ఇంటి పథకం అమలు కోసం ఏఐటీయుసి 2009 లో యాజమాన్యం తో మాట్లాడి సర్క్యులర్ ఇప్పిస్తే ఆనాడు కార్మికులు ఎవరు ముందుకు రాలేదని అందుకె అట్టి సర్కులర్ ను యాజమాన్యం పక్కకు పెట్టిందని ఆయన పేర్కొన్నారు. దీనిపై కొన్ని కార్మిక సంఘాలు ఏఐటీయుసి పై అనవసరపు విమర్శలు చేస్తూ కార్మికుల ను తప్పు దోవ పట్టిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని దీని వల్ల ఒరిగేదేమీ లేదని, ఇప్పటికే దీని పై యాజమాన్యం కమిటీ వేసిందని ఆ కమిటీ రిపోర్ట్ ఆధారంగా సొంత ఇంటి పథకం అమలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు మాట్లాడగా, నాయకులు అక్బర్ అలీ, రంగు శ్రీను, మిట్ట శంకర్, సిర్ర మల్లికార్జున్, పొన్నాలవెంకటయ్య, పెద్దెల్లి శంకర్, పి. రవి, అజీం పాషా, పర్లపెల్లి రామస్వామి, సదానందం, సానా జలపతి, అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన నిందితుడిని అరెస్ట్

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 20: తన కారుకు సైడ్ ఇవ్వనందుకు ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేసిన నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ మొగిలి వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన పిట్ల శ్రీకాంత్ అనే వ్యక్తి కార్ కు బుధవారం మధ్యాహ్నం ఇల్లంతకుంట నుండి సిరిసిల్ల వెళ్తున్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ సైడ్ ఎవ్వలేదని కారును కొంత దూరం వెళ్లిన తర్వాత తిప్పుకొని వచ్చి ఆర్టీసీ బస్సుకు కారును అడ్డుగా నిలిపి బస్సు డ్రైవర్ బాలరాజును దుర్భాషలాడి బస్సు డ్రైవింగ్ క్యాబిన్లోకి వచ్చి డ్రైవర్ అయిన కల్లూరి బాలరాజును కొట్టి, బస్ అద్దాన్ని పగలగొట్టడానికి రాయితో విసరగా అద్దం పగిలి రోడ్డుకు పక్కన కూర్చున్న వల్లంపట్ల గ్రామానికి చెందిన సండి వజ్రవ్వ మోకాలిపై గాయం తగిలింది. ఘటనను ప్రశ్నించిన ఓబులాపూర్ గ్రామానికి చెందిన ప్రయాణికురాలు బత్తుల రాజవ్వతో కూడా నిందితుడు వాగ్వాదానికి దిగాడు. మొత్తం ఘటనను బస్సు కండక్టర్ తన మొబైల్ ఫోన్‌లో వీడియోగా రికార్డు చేయగా వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నిందితుడు నిన్నటి నుండి పరారీలో ఉండగా, దాడికి గురైన డ్రైవర్ బాలరాజు ఫిర్యాదు మేరకు ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో నిన్నటి రోజున కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు ఇల్లంతకుంట ఎస్.ఐ అశోక్ ఆధ్వర్యంలో మూడు టీమ్ లు ఏర్పాడి సాంకేతికత ఆధారంగా ఈరోజు సాయంత్రం రహీంఖాన్ పేట గ్రామ శివాలో నిందితున్ని అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీ గురించి రిమాండ్ కు తరలించడం జరిగిందని సి.ఐ మొగిలి తెలిపారు..



సీఎం సహాయనిధి చెక్కులను

అందజేసిన ఎంపీ

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 20: కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం 11 మందికి రూ. 6 లక్షల 25 వేల విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి నిజమైన వరమని చెప్పారు. ఎన్నోవేలాది పేద-మధ్యతరగతి కుటుంబాలకు ఈ సహాయనిధి అండగా నిలుస్తోందని వివరించారు. సీఎం సహాయనిధి అందేలా కృషి చేసినందుకు ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



బండి సంజయ్ పై కేసు కొట్టివేత కేటీఆర్ కు చెంపపెట్టు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపీ

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 20: బండి సంజయ్ పై అక్రమంగా పెట్టిన పేపర్ లీకేజీ కేసు హైకోర్టు కొట్టివేత కేటీఆర్ కు చెంపపెట్టని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. హైకోర్టు పేపర్ లీకేజీ కేసు కొట్టి వేయడాన్ని హర్షిస్తూ గురువారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌక్ వద్ద స్థానిక బిజెపి నాయకులతో కలిసి టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం గోపి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేటీఆర్ బండి సంజయ్ పై అక్రమంగా పెట్టిన టెన్త్ పేపర్ లీకేజీ కేసు పెట్టించాడని, తన ఇంట్లో కార్యక్రమం ఉందని చెప్పిన పోలీసులు అరాచకంగా తనను అర్ధరాత్రి అరెస్టు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ కేసు నిరాధారమైనదని హైకోర్టు తీర్పు వేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే ఎల్లారెడ్డిపేట మండలంలో బిజెపి శ్రేణులపై కేటీఆర్ అక్రమ కేసులు పెట్టించాడని, గత ప్రభుత్వంలో కేటీఆర్ అధర్మంగా బిజెపి నాయకులపై పెట్టించిన కేసులు ధర్మ యుద్ధంతో గెలుస్తామని స్పష్టం చేశారు. అధికార దుర్వినియోగం చేసి భయభ్రాంతులకు గురి చేసే విధంగా పెట్టిన దొంగ కేసుల్లో ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని తెలిపారు. సిరిసిల్లలో రైతులు గోసపడుతుంటే రెండేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్ పత్తా లేదని జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలుపు కోసం ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ తో పాటు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రవీందర్ గౌడ్



ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 20: రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం గీత కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరితో ముందుకెళ్తున్న క్రమంలో ఈ నెల 28న సూర్యపేట జిల్లా కేంద్రంలో తలపెట్టిప తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం 'గీతన్నల రణభేరి' భారీ బహిరంగ సభ పోస్టర్ను హుస్నాబాద్ పట్టణంలో, పందిళ్ళ, పొట్లపల్లి గ్రామాలలో ఆవిష్కరణ చేయడం జరిగిందని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రవీందర్ గౌడ్ తెలిపారు. రెండు సంవత్సరాలు గడిచిన తాడిచెట్టు పైనుండి కిందపడి చనిపోయిన గీతా కార్మికులకు, వికలాంగులైన వారికి ఒక్క రూపాయి కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించలేదని అన్నారు. అర్హులైన గీత కార్మికులకు కొత్త పెన్షన్ల ఇవ్వడం లేదని, పాత పెన్షన్ పెంపు లేదని, బెల్ట్ షాపులు రద్దు చేస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేర్చలేదని అన్నారు. రాష్ట్రంలో ఇష్టారాజ్యంగా మద్యం ఏరులై పాడడం వల్ల అతి ప్రాచీన కల్లు గీత కార్మిక వృత్తి మనుగడ కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. ఇంకా అనేక సమస్యలపై కార్మికులను ఇబ్బంది పెడుతున్న క్రమంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పూదరి రాజు, మొలంగూరు శ్రీనివాస్, పచ్చిమట్ల శ్రీనివాస్, వడ్లకొండ శ్రీనివాస్, పూదరి మల్లేశం, బైరి మహేందర్, పొట్ల పెల్లి మాజీ ఉపసర్పంచ్ శ్యాంసుందర్ గౌడ్, పందిళ్ళ కల్లు గీత కార్మిక నాయకులు బొమ్మగాని రవీందర్, పొట్లపల్లి గీత కార్మికులు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నిషేదిత టొబాకో ప్యాకెట్లు పట్టివేత

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 20 : నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో నిషేదిత టొబాకో ప్యాకెట్లు చేరవేస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు గురువారం రైల్వే ఎస్సై సాయా రెడ్డి తెలిపారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది కలసి ఒకటవ ప్లాట్ ఫారం పై తనిఖీ చేస్తుండగా నిజామాబాద్ ఆటో నగర్ కు చెందిన అబ్దుల్ అనీస్ నిషేదిత టొబాకో పదార్థాలు రైలులో తరలిస్తుండగా వాటిని పట్టుకొని అబ్దుల్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీటి విలువ రూ.3 వేలు ఉంటుందని ఎస్సై సాయా రెడ్డి తెలిపారు.



"పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బందితో సహా ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు. ఉద్యోగులను బెదిరించినా, దాడులు చేసినా చట్ట ప్రకారం బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేసి, హిస్టరీ షీట్స్ కూడా తెరుస్తాం. క్షణికావేశంలో ఏ చిన్న తప్పు చేసినా జీవితాంతం కుమిలి పోవాల్సి వస్తుం.

-హైదరాబాద్ సీపీ సజ్జనార్

ప్రాంతీయం

రైతుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

- మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటెల రాజేందర్



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 20: రాష్ట్ర ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా లో ఈటెల పర్యటించారు. జమ్మికుంట లో ఆయన మాట్లాడారు. పంటలు చేతికి వచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు. మిల్లర్లు ధాన్యం దింపుకునే విషయంలో రోజులు లాగుతున్నారు. క్వింటాల్కు ఎనిమిది కిలోలా తరుగు పేరిట దోపిడీ చేస్తున్నారంటూ ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. సన్నవడ్లకు ప్రకటించిన రూ.500 బోనస్ ఇప్పటికీ అందరికీ చేరలేదని, ఈసారి అయినా ప్రతి రైతుకు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.రైతు రుణమాఫీ పేరుతో ఇచ్చిన హామీ కూడా ఇంకా నెరవేర లేదని, వరదలతో మునిగిన వరి రైతులు, తుఫానుతో నష్టపోయిన రైతులు అడ్డంకులు లేకుండా ప్రభుత్వం ప్రకటించిన పది వేల రూపాయల సహాయం వెంటనే అందేలా చూడాలన్నారు. పత్తి కొనుగోళ్లలో కూడా జాప్యం ఉండకూడదని, కఠినమైన '7 క్వింటాళ్ల' నిబంధనను ఎత్తివేయాలని, వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సీసీఐ కూడా నిబంధనలు సడలించాలని కోరారు. ఫసల్ భీమా చెల్లింపులు ప్రభుత్వం సమయానికి చేస్తే రైతులు ఇబ్బందులు పడేవారేమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సీట్లను గెలుచుకుంటుందని ఈటల ధీమా వ్యక్తం చేశారు. అబద్ధాలే ఆధారంగా బ్రతికే వారికి ప్రజలే బుద్ధి చెప్తారు అని తీవ్రంగా వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభా, బీజేపీ కన్వీనర్ మాడ గౌతం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, మాజీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, మాజీ సర్పంచ్ సురేందర్ రాజు, మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్, మహిళా మోర్చా జిల్లా ప్రతినిధి రమరెడ్డి, పార్టీ నాయకులు సమ్మయ్య, దేవిక, చొప్పరి వేణు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



పేపర్ లీక్ కేసులో బండి సంజయ్ నిర్దోషి

- కోర్టు తేల్చిన నేపథ్యంలో బీజేపీ శ్రేణుల సంబరాలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్. నవంబర్ 20: పదవ తరగతి పేపర్ లీక్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ నిర్దోషిగా హైకోర్టు తేల్చిన నేపథ్యంలో గురువారం రాత్రి కరీంనగర్ బీజేపీ శ్రేణులు స్థానిక తెలంగాణ చౌక్లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ నేతలు మాజీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు కేసులతో బండి సంజయ్ కుమార్ ను అనేక ఇబ్బందులు పట్టే ప్రయత్నం చేసిందన్నారు. కెసిఆర్ నియంతృత్వ వ్యతిరేక విధానాలను బండి సంజయ్ కుమార్ ప్రజా క్షేత్రంలో ఎండగడితే జీర్ణించుకోలేని స్థితిలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక తప్పుడు కేసులు పెట్టిందని తెలిపారు. అందులో పదోతరగతి పేపర్ లీక్ కేసు కూడా ఒకటని , 2023 పదవ తరగతి పేపర్ లీక్ చేసినట్టు బండి సంజయ్ కుమార్ ను నాడు కెసిఆర్ ప్రభుత్వం అక్రమ కేసు పెట్టి అరెస్టు చేసి జైలుకు తరలించి శునకానందం పొందిందన్నారు. నాడు అక్రమంగా బండి సంజయ్ మీద పెట్టిన కేసును కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు నేడు తీర్పు ఇవ్వడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మీడియా కన్వీనర్ కటకం లోకేష్ , ఎండి ముజీబ్ , రాపర్తి ప్రసాద్ , కోలగని శ్రీనివాస్ , వంగల పవన్ , బండ రమణా రెడ్డి, లెక్కల వేణుగోపాల్ , కరీంనగర్ జోన్ అధ్యక్షులు బండారు గాయత్రి, అవదుర్తి శ్రీనివాస్, తణుకు సాయి,పార్వజ్, జాడి బాల్ రెడ్డి, నాగసముద్రం ప్రవీణ్,ఉప్పరపల్లి శ్రీనివాస్, సురేష్, సంపత్, రాజు , వరాల జ్యోతి, మాసం గణేష్, మాడిశెట్టి సంతోష్, సమీ వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కారులో తరలిస్తున్న అల్ప్రాజోలం పట్టివేత

- ముగ్గురు వ్యక్తులు అరెస్టు
- నిజామాబాద్ లో నార్కోటిక్ పోలీసుల దాడి



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 20 : నిజామాబాద్ నుండి ముదక్ పల్లి కి కారులో తరలిస్తున్న అల్ప్రాజోలం మత్తు పదార్థాన్ని జిల్లా కేంద్రంలోని గంగస్థాన్ వద్ద నార్కోటిక్ బృందం పట్టుకుంది. ఇటీవల నిజామాబాద్ లో కల్తీ కల్లుకు వినియోగించే అల్ప్రాజోలం (మత్తుమందు) వాడకం పెరిగిపోవడంతో దానిని నియంత్రించేందుకు నార్కోటిక్ బృందం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో కొంతమంది కల్లు డిపోలల్లో అల్ప్రాజోలం వినియోగించి కల్తీ కల్లు తయారు చేసి విక్రయాలు జరుగుతున్నట్లు అధికారుల దృష్టికి రావడంతో అధికారులు దాడులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా గురువారం నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కారులో అల్ప్రాజోలం తరలిస్తున్నట్లుగా సమాచారం అందడంతో నార్కోటిక్ ఇన్స్పెక్టర్ పూర్ణేశ్వర్, రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్వో శ్రీనివాస్ తమ టీమ్లతో కలిసి గంగాస్థాన్ ప్రాంతంలో కారును పట్టుకొని తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కారులో రూ.1.5 లక్షల విలువచేసే 150 గ్రాముల అల్ప్రాజోలం (మత్తు పదార్థం) పట్టుకున్నారు. ఈ మత్తు పదార్థాన్ని నిజామాబాద్ నుండి మొదక్ పల్లి కి తరలిస్తున్న మోపాల్ మండలం మొదక్ పల్లి ప్రాంతానికి చెందిన రాజా గౌడ్ తో పాటు శ్రీనివాస్ గౌడ్, సుజీత్ గౌడ్ అనే ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని కారును సీజ్ చేశారు. అల్ప్రాజోలం తో పట్టుబడిన ముగ్గురి పై రూరల్ పోలీస్ స్టేషన్ లో ఎస్హెచ్వో శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

మల్టీలెవెల్ మార్కెటింగ్ పేరుతో మోసాలు

- నిందితుల అరెస్ట్



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 20 : బీఎంబీ మల్టీ లెవెల్ మార్కెటింగ్ చైన్ సిస్టం లో ప్రజలను మోసం చేసిన నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. గురువారం పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడుతూ ప్రజలు మోసపూరితమైన మల్టీ లెవెలింగ్ మార్కెటింగ్ చైన్ సిస్టం లో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో లాభాలను పొందాలని ఉద్దేశంతో పెట్టుబడులు పెట్టి మోసపోకూడదన్నారు. ఇలాంటి ఎరవేసి మభ్యపెట్టి మోసపూరిత మాటలు చెప్పి ఆకర్షణ చేసే వ్యక్తుల గురించి తమ ఏరియాలో ఉన్న పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ విధంగా మోసపోయిన కోటగల్లి కి చెందిన తోకల బక్కన్న అక్టోబర్ 13న కోటగల్లీలోని కెనరా బ్యాంకు పక్కకు ఉన్న బీఎంబీ కంపెనీ చూసి అక్కడికి వెళ్ళగా నిందితుడైన చంద్రశేఖర ప్రసాద్ బక్కన్నను పిలిచి అతనికి మల్టీ లెవెల్ మార్కెటింగ్ చైన్ సిస్టం అయిన బీఎంబీ కంపెనీ గురించి చెప్పాడు. అది ఇంగ్లాండు దేశంకు చెందినదని దాంట్లో పెట్టుబడి పెట్టి కంపెనీ యాడ్స్ కి రేటింగ్ ఇవ్వడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు పొందవచ్చని, అలాగే వివిధ రకాలైన గృహ ఉపకరణాలు సెల్ ఫోన్లు పొందవచ్చునని మోసపూరిత మాటల ద్వారా నమ్మించాడు. అనంతరం చంద్రశేఖర ప్రసాద్ పంపిన లింకు ద్వారా తన ఫోన్లో బీఎంబీ కంపెనీకి సంబంధించిన ఆప్ ను ఇన్స్టాల్ చేసుకుని అందులో జాయిన్ అయి, సుమారు రూ. 84,398 లు వేరువేరు లెవెల్స్ లలో విడుదల వారీగా పెట్టు బడులు పెట్టాడు. ప్రసాద్ ఫోన్లో పంపిన లింకుల ద్వారా కంపెనీ యాప్ లో ఫోన్ పే ద్వారా పంపిన లింకులలో పెట్టుబడి పెట్టి అతడు చెప్పిన మాయ మాటలకు ఆకర్షితుడై తన రక్తసంబంధీకుల తరపున తనకు తెలిసిన వారి తరపున కొంత మొత్తంలో నగదును కంపెనీ ఆప్ లో పెట్టుబడి పెట్టించాడు. అతని కంపెనీ వాలెట్ అకౌంట్ లో జమ అయిన ఫేక్ ఎమౌంటును విత్డ్రా చేయడానికి ప్రయత్నించగా అమౌంట్ విత్ డ్రా కాలేదని తాను మోసపోయానని తెలుసుకొన్నాడు. ఈ విషయాన్ని 4వ టౌన్ పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు. నిందితుడు ఈ విధంగా సుమారు 22 మందిని మోసం చేసినట్లు తెలిసిందన్నారు. బీఎం బీ కంపెనీ లో పెట్టుబడులు పెట్టి సుమారు 750 మంది వరకు మోసపోయినట్లుగా తెలిసిందన్నారు.



కేపీసీసీ చీఫ్ పదవిలో శాశ్వతంగా ఉండలేను. ఇప్పటికే ఐదున్నరేళ్లు అయింది. ఇతరులకు అవకాశం ఇవ్వాలి. డిప్యూటీ సీఎం అయినప్పుడే పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేద్దామని అనుకున్నా. కానీ కొనసాగమని రాహుల్, ఖర్గే చెప్పారు. నా డ్యూటీ నేను చేశా. ఇక్కడ ఎవ్వరూ శాశ్వతంగా ఉండలేరు. మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.

- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

విద్యార్థులు ఆంగ్ల భాష పై పట్టు సాధించేలా తీర్చిదిద్దాలి

- ప్రతి విద్యార్థికి పాఠ్యాంశం అర్థమయ్యే విధంగా బోధన సాగాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- హసన్ పర్తి మండలం కోమటిపల్లి, చింతగట్టు లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన జిల్లా కలెక్టర్



ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 20: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆంగ్ల భాష పై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం కోమటిపల్లి లోని అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, చింతగట్టులోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ముందుగా కోమటిపల్లి లోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రతిరోజు ఎంతమంది చిన్నారులు కేంద్రానికి వస్తుంటారని అంగన్వాడీ టీచర్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఒకటి నుండి ఐదో తరగతి వరకు ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, ఎలా చదువుతున్నారు, ఆంగ్ల భాషలో బోధిస్తున్నారా అని ఉపాధ్యాయులను కలెక్టరు అడిగి. పాఠశాల విద్యార్థులతో ఆంగ్లంలోని పాఠ్యాంశాన్ని చదివించి దాని అర్థం తెలుసా అని విద్యార్థులను కలెక్టర్ అడిగారు. ఆంగ్ల పాఠాన్ని ఉపాధ్యాయురాలు చెబుతుండగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పాఠ్యాంశం అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశం చెప్పే ముందు ఉపాధ్యాయులు ముందస్తుగా సన్నద్ధం కావాలన్నారు. విద్యార్థులు ఆంగ్ల భాషలో మాట్లాడాలని, పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకోవాలన్నారు.

భోజన పదార్థాలను పరిశీలించిన కలెక్టర్

చింతగట్టులోని ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ సందర్శించి విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతుందా అని వంట నిర్వాహకులు ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈరోజు మెనూ ప్రకారం ఏం వండారు అని భోజన పదార్థాలను తనిఖీ చేశారు. డైనింగ్ హాల్ ను కలెక్టర్ పరిశీలించారు.

జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

చింతగట్టు క్యాంపు సమీపంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. రవాణా శాఖ కార్యాలయం కోసం భూమిని కేటాయించాలని ఆ శాఖ అధికారులు కోరగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా హసన్ పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

- నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయండి: అదనపు కలెక్టర్

ప్రతిపక్షం, భూపాలపల్లి, నవంబర్ 20: ధాన్యం సేకరణ ఇన్చార్జ్ లు నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని, తేమశాతాన్ని ప్రతిరోజూ ఖచ్చితంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశించారు. గురువారం మొగుళ్లపల్లి, అనంగుల తండాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు.17% తేమ శాతం ఉన్న ధాన్యాన్నీ ఆలస్యం లేకుండా తూకం వేసి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రోజు కేంద్రానికి వచ్చిన రైతుల సంఖ్య,సేకరించిన అంచనా ధాన్యం పరిమాణం,17% తేమ శాతం వచ్చిన రైతుల సంఖ్య, ఇప్పటివరకు కొనుగోలు చేసిన మొత్తం ధాన్యం వివరాలు,రైస్ మిల్లులకు తరలించిన ధాన్యం వివరాల తోపాటు తేమశాతం రిజిస్టర్ లో క్రమ పద్ధతిగా నిర్వహించాలని, రైతుల వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. జిల్లా స్థాయి సమావేశాల్లో జారీ చేసిన మార్గదర్శకాలు, సూచనలను హార్వెస్టర్ యజమానులు మరియు ఆపరేటర్లు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి శ కిరణ్ కుమార్, డిఎం రాములు, చిట్యాల, మొగుళ్లపల్లి తహసీల్దార్లు ఇమామ్ బాషా, సునీత, సివిల్ సప్లైస్ ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పంటల కొనుగోళ్లు పకడ్బందీగా సాగాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 20 : జిల్లాలో పంటల కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంటల కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వరి, సోయా, పత్తి, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించి కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 14,760.56 క్వింటాళ్ల వరి ధాన్యం, 5,746 క్వింటాళ్ల సోయా, 7,715 క్వింటాళ్ల మొక్కజొన్న, 66,140 క్వింటాళ్ల పత్తి పంటను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. తగు తేమ శాతం వచ్చిన తరువాతే రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. పంటల కొనుగోలులో రైతులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. పత్తి రైతుల సౌకర్యార్థం 1800 599 5779 టోల్ ఫ్రీ నెంబరు, 88972 81111 వాట్సాప్ నెంబర్లు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, మార్కెటింగ్ అధికారి గజానంద్తో పాటు సిసిఐ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాన్న డీఎస్ అడుగుజాడల్లో

సంఘాన్ని బలోపేతం చేస్తా

- ఈనెల 23న జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి రాజకీయాలకు అతీతంగా అందరికీ ఆహ్వానం
- రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ రాక
- నగర తొలి మేయర్, మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడు ధర్మపురి సంజయ్



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 20 : జిల్లాలో మున్నూరు కాపుల సంఘల పటిష్టత కొరకు నాన్న చూపిన బాటలోనే నడుస్తానని నగర తొలి మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన తండ్రి డి శ్రీనివాస్ హయంలో మున్నూరు కాపుల అభివృద్ధి కోసం ఎంతగానో పనిచేశారని, అలాగే మున్నూరు కాపు కులస్తులను అందరిని సంఘటితం తీసుకురావడానికి ఎనలేని కృషి చేశారని అన్నారు. ఆయన స్ఫూర్తితో బాధ్యతతో పనిచేస్తానని అన్నారు. తన తండ్రి మరణానంతరం కాపు పెద్దలు ఈ సంఘం మరింత అభివృద్ధి చెందాలంటే మీరే అధ్యక్షుడు కొనసాగాలని తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. ఈనెల 23న జిల్లా కేంద్రం మున్నూరు కాపు సంఘం లో ప్రమాణస్వీకారం కార్యక్రమానికి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, జిల్లా ఎంపీ అరవింద్, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్, ఇతర పార్టీల నాయకులు, కుల సంఘాలను ఆహ్వానించినట్లు తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నుండి కీలక ముఖ్య నేతల తో పాటు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా మున్నూరు కాపు అధ్యక్షులు, కార్యవర్గ కమిటీ, తోపాటు కుల బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 20 : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సన్నాహక ప్రక్రియను పొరపాట్లకు తావులేకుండా పక్కాగా పూర్తి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కమ్మర్పల్లి, ఆర్మూర్ తహసిల్దార్ కార్యాలయాలను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియ అమలు, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం కోసం చేపట్టిన చర్యలపై సమీక్ష జరిపారు. 2002 ఓటరు జాబితాతో ప్రస్తుత 2025 ఓటరు జాబితాను సరిపోల్చుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత నమూనాలో వివరాలు రూపొందించారా అని పరిశీలించారు. నిర్దిష్ట గడువు లోపు ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా, భూభారతి, గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఇంకనూ ఏవైనా అర్జీలు పెండింగ్ లో ఉంటే, వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు. చిన్నచిన్న కారణాల వల్ల దరఖాస్తులను రిజెక్ట్ చేయకూడదని, క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలన జరిపి అర్హులుగా నిర్ధారణ అయిన వారి దరఖాస్తులను ఆమోదించాలన్నారు. ఈ సందర్భంగా పలు దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి తహసిల్దార్లు ప్రస్తావించిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేస్తూ, వాటిని ఏ మాడ్యుల్ లో పరిష్కరించవచ్చు అనే అంశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ వెంట కమ్మర్పల్లి తహసిల్దార్ ప్రసాద్, ఆర్మూర్ తహసిల్దార్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన...

కాగా, వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను గమనించి, రైస్ మిల్లులకు వెంటదివెంట తరలించాలని అధికారులకు సూచించారు. బిల్లుల చెల్లింపుల విషయంలో జాప్యానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ ప్రమాణం

- హాజరైన ప్రధాని మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 20: జనతాదళ్ (యు) అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా గురువారం పదో సారి ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు. నితీశ్ తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణం చేశారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. 243 అసెంబ్లీ స్థానాలకు గాను, నితీశ్ కుమార్ నేతృత్వంలోని కూటమి ఏకంగా 202 సీట్లను కైవసం చేసుకుంది. బీజేపీ 89 స్థానాల్లో గెలుపొందగా, జేడీయూ 85 స్థానాలలో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఏర్పాటైన కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 14 మందికి, జేడీయూ నుంచి 9 మందికి చోటు దక్కింది. నితీశ్ కుమార్ దాదాపు 19 యేండ్లుగా బిహార్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎంగా ఏడు రోజులు మాత్రమే పనిచేసిన ఆయన, ఇప్పుడు పదోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు.



విశ్వ వీక్షణం



అనిల్ అంబానీ ఆస్తులు 1400 కోట్లు సీజ్

- విచారణలో భాగంగా ఈడీ కఠిన చర్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 20 : కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ అనిల్ అంబానీకి చెందిన కంపెనీలపై భారీ చర్యలు తీసుకుంది. తాత్కాలిక అటాచ్‌మెంట్ ఆర్డర్ కింద దాదాపు 1400 కోట్ల రూపాయల విలువైన స్థిర ఆస్తులను స్వాధీనం చేసుకుంది. దీనితో ఈడీ ఇప్పటి వరకు ఏడీఏజీ గ్రూప్‌కు చెందిన 9000 కోట్ల రూపాయల ఆస్తులను అటాచ్ చేసింది. స్వాధీనం చేసుకున్న ఈ ఆస్తులు నవీ ముంబై, చెన్నై, పూణే, భువనేశ్వర్‌లో ఉన్నాయి. మనీ లాండరింగ్‌కు సంబంధించిన కేసులో ఈ చర్యలు తీసుకుంది. అవసరమైతే మరిన్ని ఆస్తులను అటాచ్ చేయవచ్చని తెలిపింది. గతంలోనూ 7500 కోట్ల రూపాయల ఆస్తులను అటాచ్ చేసింది. గత ఆగస్టులో ఈ ఏజెన్సీ చివరిసారిగా అంబానీని ప్రశ్నించింది. జైపూర్ రింగాస్ హైవే ప్రాజెక్టు కోసం 2010లో రిలయన్స్ ఇన్‌ఫ్రాకు కాంట్రాక్ట్ లభించింది. ఈ ప్రాజెక్టు నుంచి రూ.40 కోట్లు (సుమారు 1.2 బిలియన్ డాలర్లు) సూరత్‌లోని షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు బదిలీ అయ్యాయని ఏజెన్సీ ఆరోపించింది. ఇది రూ. 600 కోట్లకు పైగా ఉన్న పెద్ద అంతర్జాతీయ హవాలా నెట్ వర్క్‌లో భాగం కావచ్చు. ఇంతకుముందు, అనిల్ అంబానీ, ఇతరులపై మోసం, కుట్ర, అవినీతి ఆరోపణలతో సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. 2010, 2012 మధ్య భారతీయ, విదేశీ బ్యాంకుల నుంచి మొత్తం రూ.40 వేల కోట్లకుపైగా రుణాలు తీసుకున్నట్లు నివేదించింది. ఈ డబ్బు బదిలీ అయిన ఐదు ఖాతాలను బ్యాంకులు మోసపూరితమైనవిగా ప్రకటించాయి.



చలికాలంలో చట్నీస్

శీతాకాలంలో మిమ్మల్ని మీరు వెచ్చగా ఉంచుకోవడానికి, మీ ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం చాలా ముఖ్యం. ఈ సీజన్‌లో వ్యాధుల ముప్పు కూడా పెరుగుతుంది. అందువల్ల, ఆహారంలో ఆరోగ్యకరమైన వాటిని చేర్చడం చాలా ముఖ్యం. ఈ పరిస్థితుల్లో ఆహారంలో కొన్ని ప్రత్యేకమైన చట్నీలను చేర్చడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

చలికాలంలో రుచికరమైన ఆహారాన్ని ఆస్వాదిస్తూ మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. చట్నీలు మీ ఆహారం రుచిని పెంచడమే కాకుండా, వాటిలో ఉండే పోషకాలు వ్యాధులతో పోరాడే మీ సామర్థ్యాన్ని కూడా బలోపేతం చేస్తాయి. అందువల్ల, శీతాకాలంలో మీ ఆహారంలో కొన్ని రకాల చట్నీలను చేర్చడం వల్ల మీ ఆహారం రుచిని మెరుగుపరచడమే కాకుండా మీ ఆరోగ్యాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. శీతాకాలంలో మీ ఆహారంలో ఏ 6 రకాల చట్నీలను చేర్చుకోవచ్చో మాకు తెలియజేయండి.

ఉసిరి చట్నీ

ఉసిరిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుది. ఇది జలుబు, దగ్గును నివారించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా, ఇది జుట్టు, చర్మం మరియు కళ్ళకు కూడా చాలా ప్రయోజనాలను అందిస్తుంది. ఉసిరి చట్నీ చేయడానికి ఉసిరికాయను కడిగి, కట్ చేసి, మసాలా దినుసులతో ఉడికించాలి. ఈ చట్నీని పెరుగు లేదా పరాటాతో తినవచ్చు.

క్యారెట్ చట్నీ

క్యారెట్‌లో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది కంటి చూపుకు చాలా మేలు చేస్తుంది. ఇది జీర్ణక్రియకు కూడా చాలా మేలు చేస్తుంది. క్యారెట్ చట్నీ చేయడానికి, క్యారెట్‌లను ఉడకబెట్టి, గ్రైండ్ చేసి, దానికి మసాలా దినుసులు వేసి రుచికరమైన చట్నీ చేయవచ్చు.

ముల్లంగి చట్నీ

ముల్లంగి సరైన జీర్ణ క్రియ సక్రమంగా జరగడానికి సహాయపడుతుంది. ముల్లంగి చట్నీ చేయడానికి, ముల్లంగి తురుము, దానికి కొద్దిగా నిమ్మరసం, ఉప్పు మరియు పచ్చిమిర్చి వేసి రుచికరమైన చట్నీ చేయవచ్చు.

వెల్లుల్లి సాస్

వెల్లుల్లిలో యాంటీఆక్సిడెంట్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి, ఇవి శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. వెల్లుల్లి చట్నీ చేయడానికి, మీరు వెల్లుల్లి గ్రైండ్ చేసి, దానికి కొద్దిగా నూనె, ఉప్పు మరియు పచ్చిమిర్చి వేసి రుచికరమైన చట్నీ చేయవచ్చు.

పుదీనా చట్నీ

పుదీనా జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది, కడుపులో గ్యాస్‌ను తగ్గిస్తుంది. పుదీనా చట్నీ చేయడానికి, పుదీనా ఆకులను కడిగి, వాటిని గ్రైండ్ చేసి, ఉప్పు మరియు జీలకర్ర వేసి రుచికరమైన చట్నీ చేయవచ్చు.


చింతపండు చట్నీ

చింతపండులో విటమిన్ సి, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. చింతపండు చట్నీ చేయడానికి, చింతపండును నీటిలో నానబెట్టి, దాని గుజ్జును తీసి, దానికి బెల్లం, ఉప్పు మరియు పచ్చిమిర్చి వేసి రుచికరమైన చట్నీ చేయవచ్చు.

చట్నీ చేయడానికి కొన్ని చిట్కాలు

- చట్నీ చేయడానికి తాజా కూరగాయలను ఉపయోగించండి.
- చట్నీ ఎక్కువసేపు తాజాగా ఉండాలంటే కొద్దిగా నూనె ఉపయోగించాలి
- మీకు నచ్చిన విధంగా మీరు చట్నీకి వివిధ మసాలా దినుసులను జోడించవచ్చు
- చట్నీని పెరుగు, పరోటాలు, పకోడీలు లేదా కూరగాయలతో తినవచ్చు.





మళ్లీ నిరసనలతో మండుతున్న బంగ్లాదేశ్

- హసీనాకు మరణశిక్షతో ఆందోళనలు షురూ

ఢాకా (బంగ్లాదేశ్), నవంబర్ 20: రిజర్వేషన్ల అంశం ఆగస్టులో బంగ్లాదేశ్‌లో మంటలు రేపింది. భారీ ఉద్యమంతో అల్లకల్లోలం నెలకొంది. దీంతో ప్రజలు తిరుగుబాటుతో షేక్ హసీనా పదవికి రాజీనామా చేసి దేశం వీడారు. తాజాగా మళ్లీ బంగ్లాదేశ్ మండుతోంది. మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ) విధించిన మరణశిక్ష దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ ప్రకంపనలు రేపింది. ఆమె మద్దతుదారులు వీధులపైకి వచ్చి నిరసనలు ప్రారంభించడంతో ఢాకా సహా పలు నగరాలలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనలలో ఇద్దరు మరణించగా పలువురు గాయపడ్డారు. చివరకు నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు సౌండ్ గ్రెనేడ్లు, టియర్ గ్యాస్ వినియోగించాల్సి వచ్చింది. ధన్మొండి 32 ప్రాంతంలో హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ నివాసం సమీపంలో అల్లర్లు ఎక్కువయ్యాయి. హసీనా మద్దతుదారుల అవామీ లీగ్ ప్రభుత్వం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా రెండు రోజుల బంద్ ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యదర్శులు ఈ చర్యను 'ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం 'గా అభివర్ణించారు. తాత్కాలిక ప్రభుత్వం నాయకుడు మహ్మద్ యూనస్ పోలీసులను, సైనిక బలగాలను సున్నిత ప్రాంతాలలో భారీగానే మోహరించారు. వాణిజ్య కేంద్రాలు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. రవాణా నిలిచిపోయింది. ప్రజలలో అసహనం పెరుగుతూ బంగ్లాదేశ్ మళ్లీ రాజకీయంగా అస్థిర దిశలో వెళ్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



ఎన్ఐఏ కస్టడీలో ముగ్గురు వైద్యులు, మత బోధకుడు

- ఎర్రకోట పేలుడులో వేగంగా సాగుతున్న విచారణ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 20 : ఎర్రకోట వెలుపల జరిగిన ఘోర కారు పేలుడు కేసు విచారణలో ఎన్ఐఏ వేగం పెంచింది. ఈ నెల పదిన జరిగిన పేలుడు సంఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో దగ్గరి సంబంధం ఉందని గుర్తించిన ఎన్ఐఏ ముగ్గురు వైద్యులు, ఒక మత బోధకుడిని గురువారం కస్టడీలోకి తీసుకుంది. జమ్మూకశ్మీర్ పోలీసులు ముందుగా అరెస్ట్ చేసిన డాక్టర్లు ముజమ్మిల్ గనాయి, అదీల్ రాథర్, షాహీనా సయీద్‌తో పాటు మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేయ్ ఎన్ఐఏ కస్టడీలో ఉన్నారు. ఆ నలుగురు కూడా ఎర్రకోట పేలుడు కుట్రలో ప్రముఖ పాత్ర పోషించారని ఎన్ఐఏ చెబుతోంది. ఇప్పటికే ఈ కేసులో అమీర్ రషీద్ అలీ, జాసిర్ బిలాల్ వాని (అలియాస్ దానిష్) అనే ఇద్దరిని అరెస్ట్ చేసింది. దీంతో అరెస్టుల సంఖ్య ఆరుకు చేరింది. పేలుడు జరిగిన ఐ20 కారును నడిపింది. డాక్టర్ ఉమర్ ఉన్ నబీ. వాహనాన్ని అమీర్ రషీద్ అలీ పేరు మీద కొనుగోలు చేసినట్టు తేలింది. ఆత్మాహుతి బాంబర్‌గా మారమని ఉమర్ ను జాసిర్ ఒప్పించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. అయితే అతడు అంగీకరించకపోయినా, నిషేధిత జైషే మహ్మద్ కోసం ఓవర్ గ్రౌండ్ వర్కర్‌గా పనిచేయడానికి సిద్ధపడ్డాడని విచారణలో బయటపడింది. వైట్ కాలర్ టెరర్ మాడ్యూల్‌లో వైద్యులు, విద్యాసంస్థలతో సంబంధం ఉన్న వ్యక్తులు భాగమైనట్టు అధికారులు చెబుతున్నారు.

శబరిమల దర్శనానికి ఇక పాస్ తప్పనిసరి

- కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం, దేవస్వం బోర్డు


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, శబరిమల (కేరళ), నవంబర్ 20 : అయ్యప్ప స్వామి ఆలయానికి రద్దీ పెరుగుతుండడంతో, హైకోర్టు ఆదేశాల ప్రకారం కేరళ ప్రభుత్వం, ట్రావెన్ కోర్ దేవస్వం బోర్డు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. ఇక నుంచి శబరిమల దర్శనానికి వర్చువల్ క్యూ పాస్ తప్పనిసరి చేశాయి. పాస్ లేకుండా నీలక్కల్ నుండి శబరిమలకు ప్రవేశం ఉండదు. వర్చువల్ క్యూ ద్వారా 70 వేల మందికి, స్పాట్ బుకింగ్ ద్వారా 5 వేల మందికి మాత్రమే దర్శనానికి అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించాయి. శబరిమలకు భారీగా అయ్యప్ప భక్తులు తరలి వస్తున్నారు. 75 వేల మందికి బోర్డు దర్శనం కల్పించనుంది. అడవి మార్గంలో వచ్చే భక్తులకు కూడా పాస్ లను తప్పనిసరి చేసింది. రద్దీని తగ్గించేందుకు నీలక్కల్ ద్వారా కొత్తగా ఏడు బుకింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది. గతంలో బోర్డు రోజుకు 90 వేల మంది యాత్రికులను అనుమతించాలని నిర్ణయించింది. 20 వేల మందిని స్పాట్ బుకింగ్ ద్వారా దర్శనం చేసుకోవడానికి అనుమతించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్న వేళ రద్దీ నియంత్రణ చర్యల పైన ప్రధానంగా న్యాయస్థానం సూచనలు చేసింది. సన్నిధానం ఫ్లైఓవర్ వెంబడి పొడవైన క్యూలు, సౌకర్యాల కొరత, తాగునీరు లేకపోవడం గురించి వివరించే రెండు దేవస్వం బోర్డు పిటిషన్లను విచారిస్తూ హైకోర్టు ఈ ఉత్తర్వులిచ్చింది.



23న స్మృతి మంధాన పెళ్లి

- శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ

వరల్డ్ కప్ విజేత స్మృతి మంధాన పెళ్లి తేదీ వచ్చేసింది. ప్రపంచకప్ టోర్నీ ముగిసినప్పటి నుంచి మంధాన వివాహంపై వస్తున్న కథనాలకు ఎట్టకేలకు వెడ్డింగ్ కార్డ్‌తో ఎండ్ కార్డ్ పడింది. బాలీవుడ్ సింగర్ పలాశ్ ముచ్చల్ తో ఈ ముద్దుగుమ్మ నవంబర్ 20న ఏడడుగులు నడువనుందనే వార్తలు వినిపించాయి. అయితే.. ఆ తేదీ కాస్త ముందుకు జరిగింది. నవంబర్ 23 ఆదివారం ఈ స్టార్ జంట మూడుముళ్ల బంధంలోకి అడుగు పెట్టనుంది. ఈ విషయాన్ని ఏకంగా ప్రధాని నరేంద్ర మోడీ ధ్రువీకరించడం విశేషం. కాబోయే దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన మోడీ.. పెళ్లి తేదీని బహిర్గతం చేశారు. భారత మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఈమధ్య నెట్టింట తెగ వైరలైంది. వరల్డ్ కప్‌లో తన ఆటతో పాటు ఆమె పెళ్లి పత్రిక కూడా సోషల్ మీడియాలో తెగ తిరిగింది. నవంబర్ 20వ తేదీన స్మృతిపలాశ్ వివాహం అంగరంగ వైభవంగా జరగనున్నట్లు ప్రచారం జరిగింది. అంతేనా.. వీరి వివాహ ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరలైంది కూడా. మహారాష్ట్రలోని స్మృతి మంధాన స్వస్థలం సాంగ్లీలో జరగనుందని.. ఇప్పటికే పలువురికి ఆహ్వానాలు కూడా అందాయని కథనాలు వచ్చాయి. అవన్నీ ఇప్పుడు నిజం కాబోతున్నాయి. కాకపోతే పెళ్లి తేదీ 20 నుంచి 23కు మారిందంతే. ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షల సందేశంతో ఈ విషయం బయటకొచ్చింది.





గోల్డ్.. కొట్టిన నిఖత్ జరీన్

భారత మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ పసిడి పంచ్ విసిరింది. విశ్వవేదికపై తన పంచ్ పవర్ చూపించిన ఇందూరు బిడ్డ దేశానికి ఐదో బంగారు పతకం అందించింది. వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్ లో చెలరేగిపోయిన నిఖత్ 51 కిలోల విభాగంలో ప్రత్యర్థి గ్జువాన్ యీ గువోను మట్టికరిపించి విజేతగా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపరిచిన తను.. ఇప్పుడు యావత్ దేశం, తెలంగాణ రాష్ట్రం గర్వపడే విజయం సాధించింది. స్వదేశంలో జరుగుతున్న వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్‌స్‌లో నిఖత్ జరీన్ తడాఖా చూపించింది. రెండుసార్లు వరల్డ్ ఛాంపియన్ అయిన ఆమె.. గ్రేటర్ నోయిడాలో ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపిస్తూ ఫైనల్ చేరింది. సెమీస్‌లో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ గనీవ గుల్సెవర్ పై సంచలన విజయంతో టైటిల్ పోరుకు దూసుకెళ్లింది నిఖత్. కఠినమైన గుల్సెవర్‌ను ఓడించి ఉత్సాహంతో ఫైనల్లోనూ జోరు చూపింది నిఖత్. తనదైన దూకుడుతో చైనీస్ తైపీకి చెందిన గువో యీ గ్జువాన్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. మ్యాచ్ ఆసాంతం ఆధిపత్యం చెలాయించిన భారత బాక్సర్ 50తో విజేతగా నిలిచింది. ఇదే పోటీల్లో నలుగురు భారత బాక్సర్లు స్వర్ణంతో మెరిశారు. 48 కిలోల విభాగలో మీనాక్షి హుడా, ప్రీతి పవార్(54 కిలోలు), అరుంధతి (70 కిలోలు), నుపుర్ షోరాన్(84 కిలోలు) దేశానికి పసిడి పతకం అందించి మురిసిపోయారు.




సౌతాఫ్రికా వన్డే సిరీస్‌కు బుమ్రా, పాండ్యా దూరం

దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌కు సీనియర్ ఆల్‌రౌండర్ హార్దిక్ ప్యాండా, ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. ఇరుజట్ల మధ్య మూడు మ్యాచుల సిరీస్ నవంబర్ 30న ప్రారంభం కానున్నది. గాయం కారణంగా హార్దిక్ కొంతకాలంగా క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌లో పాల్గొనే అవకాశం లేదు. ప్రస్తుతం హార్దిక్ టీ20 క్రికెట్‌పై దృష్టి సారించినట్లుగా భావిస్తున్నారు. ప్రీమియర్ ఫాస్ట్ బౌలర్ల పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ వన్డే సిరీస్ నుంచి బుమ్రాకు విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్ సందర్భంగా హార్దిక్ గాయం కారణంగా పాకిస్తాన్‌తో జరిగే ఫైనల్‌లో ఆడలేకపోయాడు. హార్దిక్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. ఈ తరుణంలో నేరుగా మళ్లీ 50 ఓవర్ల క్రికెట్ ఆడడం ప్రమాదకరమయ్యే అవకాశం ఉంది. హార్దిక్ టీ20 ప్రపంచకప్‌పై దృష్టి సారించాడు. తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకునేందుకు హార్దిక్ మొదట సయ్యద్ ముస్తాఖ్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున బరిలోకి దిగనున్నాడు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌లో బరిలోకి దిగనున్నాడు. న్యూజిలాండ్‌తో భారత్ మూడు వన్డేలు సైతం ఆడుతుంది. ఐపీఎల్ తర్వాత సీనియర్ ప్లేయర్లు 2027 వన్డే ప్రపంచకప్‌పై దృష్టి సారించనున్నారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 22 నుంచి దక్షిణాఫ్రికాతో జరుగనున్న రెండో టెస్ట్ కోసం భారత జట్టు గౌహతికి చేరుకుంది. రెండు మ్యాచుల సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 01 తేడాతో వెనుకపడింది. సిరీస్‌ను సమయం చేయాలని భావిస్తుంది. అయితే, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడడం టీమిండియాను కలవరపెడుతున్నది. రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా? లేదా? అన్నదాంట్లో స్పష్టత లేదు.



చరిత్ర సృష్టించిన బంగ్లా వెటరన్ ప్లేయర్ రహీమ్


బంగ్లాదేశ్ వెటర్ ప్లేయర్ రహీమ్ చరిత్ర సృష్టించాడు. గురువారం ఢాకాలోని షేర్ బంగ్లా నేషనల్ స్టేడియంలో ఐర్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో ముష్ఫికర్ తన టెస్ట్ కెరీర్‌లో 13వ సెంచరీ చేశాడు. కెరీర్‌లో 100వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతూ.. సెంచరీ చేసిన 11వ ప్లేయర్‌గా నిలిచాడు. ఈ ఘనత సాధించిన కొంత మంది దిగ్గజ బ్యాట్స్‌మెన్ సరన స్పెషల్ టెస్ట్ క్లబ్‌లో చేరాడు. ఇంగ్లండ్‌కు చెందిన కాలిన్ కౌడ్రీ తన 100వ టెస్ట్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. 1986లో బర్మింగ్‌హామ్ టెస్ట్‌లో యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియాపై ఈ ఘనత సాధించాడు. పాక్‌కు చెందిన జావెద్ మియాందాద్ 1989లో ఈ క్లబ్‌లో చేరిన తొలి ఆసియా బ్యాట్స్‌మెన్‌గా రికార్డులకెక్కాడు. ఆస్ట్రేలియా దిగ్గజ బ్యాట్స్‌మెన్ రికీ పాంటింగ్ 2006లో దక్షిణాఫ్రికాతో సిడ్నీ టెస్ట్‌లో తన 100వ టెస్ట్‌లో డబుల్ సెంచరీ సాధించిన తొలి బ్యాట్స్‌మెన్‌గా రికార్డును నెలకొల్పాడు. ఇక డేవిడ్ వార్నర్ 2022 డిసెంబర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తన వందో టెస్ట్ లో డుబల్ సెంచరీ చేసిన తొలి క్రికెటర్‌గా ఘనతకెక్కాడు. ఇదిలా ఉండగా..ఢాకాలో జరిగిన రెండో టెస్ట్ ప్రారంభానికి ముందు ముష్ఫికర్ రహీమ్‌ను ఈ ఘనత సాధించినందుకు బీసీబీ సత్కరించింది. ఈ సందర్భంగా రెండు జెర్సీలను బహూకరించారు. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టెస్ట్ సహచరులు సంతకం చేసింది కాగా.. రెండోది ప్రస్తుత టెస్ట్ టీమ్ సభ్యులు సంతకాలు చేశారు. ఆ తర్వాత 100వ నెంబర్ ఉన్న క్యాప్‌తో పాటు జ్ఞాపికను అందించింది. 38 సంవత్సరాలు ముష్ఫికర్ రహీమ్ టెస్ట్ కెరీర్‌కు ముగింపు పలికే ఆలోచన లేదని బీసీబీ క్రికెట్ ఆపరేషన్స్ చైర్మన్ నజ్ముల్ అబెదిన్ స్పష్టం చేశారు.



నవంబర్ 23న #NC24 ఫస్ట్ లుక్ రిలీజ్

యువ సామ్రాట్ నాగ చైతన్య #NC24తో థ్రిల్ చేయబోతున్నారు. విరూపాక్షతో సంచలన విజయాన్ని అందుకున్న కార్తీక్ దండు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మక బ్యానర్లపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. లాపతా లేడీస్ ఫేమ్ స్పార్ష్ శ్రీవాస్తవ కీలక పాత్ర పోషిస్తున్నారు. సినిమా మేకర్స్ తాజాగా విడుదల చేసిన స్ట్రైకింగ్ & ఇమర్సివ్ బీటీఎస్ మేకింగ్ వీడియో సినిమా భారీ స్కేల్, విజన్, అంబిషన్‌ను చూపించింది. విడుదలైన వెంటనే ఈ గ్లిమ్ప్స్ ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా కోసం జరుగుతున్న కృషి, క్రియేటివ్ వర్క్ అద్భుతంగా కనిపిస్తోంది. ప్రొడక్షన్ డిజైనర్ నాగేంద్ర కుమార్ తంగాల ఎకరాల విస్తీర్ణంలో వందలాది టెక్నీషియన్స్ కష్టపడి నిర్మించిన భారీ సెట్ విజువల్ ఎక్సలెన్స్‌ను ప్రతిబింబిస్తోంది. వీడియోలో నాగ చైతన్య ఫిజికల్, యాక్షన్ ట్రైనింగ్ కట్టిపడేసింది. ఇంటర్నేషనల్ యాక్షన్ కొరియోగ్రాఫర్ జుజి మాస్టర్ పర్యవేక్షణలో ఆయన చేసిన ట్రైనింగ్, పాత్ర కోసం తీసుకున్న ట్రాన్స్‌ఫర్మేషన్ అద్భుతంగా వున్నాయి. మేకింగ్ గ్లిమ్ప్స్‌లో అనేక మంది ఆర్టిస్టులు, పెర్ఫార్మర్లు పాల్గొన్న భారీ సీన్స్ ఆకట్టుకున్నాయి. సినిమా ఎలాంటి ఎపిక్ కాన్వాస్ మీద తీర్చిదిద్దబడుతోందో స్పష్టమవుతుంది. అజనీష్ లోకనాథ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మ్యూజిక్ వీడియోకు మరింత మిస్టరీ, ఇంటెన్సిటీని జోడించి, సినిమా ఏ రకం ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్తుందో ముందుగానే అనుభూతి కలిగిస్తోంది. నవంబర్ 23న నాగ చైతన్య బర్త్ డే సందర్భంగా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఈ అప్‌డేట్ ఇప్పటికే అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న రివీల్స్‌లో ఒకటిగా మారింది.

'ప్రేమంటే' అందరూ రిలేట్ అయ్యే సినిమా



ప్రియదర్శి రిఫ్రెషింగ్ రొమాంటిక్ కామెడీ మూవీ ప్రేమంటే. ఆనంది హీరోయిన్ గా నటిస్తోంది. సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్‌గా అరంగేట్రం చేస్తున్నారు. ఈ సినిమా టీజర్ ట్రైలర్ సాంగ్స్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో ప్రియదర్శి విలేకర్ల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. "ప్రతి సినిమాకి రిలీజ్ ముందు ఎక్సయిట్మెంట్, నెర్వస్‌నెస్ ఉంటుంది. ఒక రైతు వాన కోసం ఎదురుచూసినట్టు నేను కూడా రిజల్ట్ కోసం ఎదురుచూస్తుంటాను. ప్రేమలో రెండు భాగాలు ఉంటాయి. మన కవులు గొప్ప గొప్ప దర్శకులు ప్రేమ ఎంత అద్భుతంగా ఉంటుందో చెప్పారు చూపించారు. అదంతా థియరీ. అయితే మనకి ప్రేమ యొక్క అప్లికేషన్ కూడా అర్థం కావాలి. అది ఎక్కువసార్లు పెళ్లి ద్వారానే అర్థమవుతుంది. సునీల్, రామ్మోహన్, జాన్వి అందరూ చాలా సపోర్టివ్. సినిమాని ఎక్కడ కూడా కాంప్రమైజ్ కాకుండా చేశారు .మాకు అన్ని రకాలుగా సపోర్ట్ చేశారు. అలాగే స్పిరిట్ మీడియా సపోర్ట్ కూడా ఎంతో హెల్ప్ అయ్యింది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది.



'కొదమ సింహం' నవంబర్ 21న రీరిలీజ్

మెగాస్టార్ చిరంజీవి తరతరాలుగా తెలుగు సినిమా తిరుగులేని స్టార్ గా ఎందుకు కొనసాగుతున్నారో మరోసారి చూపించారు. తన లెజెండరీ వెస్ట్రన్‌యాక్షన్ క్లాసిక్ కొదమ సింహం (1990) నుండి ఒక స్టిల్‌ను మెగాస్టార్ స్వయంగా 35 సంవత్సరాల తర్వాత అద్భుతంగా రీక్రియేట్ చేశారు. ఈ లుక్ అదిరిపోయింది. 90లలో జానర్, హీరోయిజాన్ని రీడిఫైన్ చేసిన తెలుగు సినిమాలో కొదమసింహం ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఇప్పుడు, చిరంజీవిని అదే లుక్‌లో చూడటం అభిమానులని మెస్మరైజ్ చేసింది. మెగాస్టార్ స్క్రీన్ ప్రజెన్స్, సాటిలేని చరిస్మా దశాబ్దాల క్రితం ఉన్నట్లే నేడు కూడా అంతే పవర్ ఫుల్ గా వుంది. ఈ ఐకానిక్ మూమెంట్ సెలబ్రేట్ చేసుకుంటూ 'కొదమ సింహం' నవంబర్ 21న గ్రాండ్ థియేట్రికల్ రీరిలీజ్‌కు సిద్ధమౌతోంది. ఇది అభిమానులకు ఈ మ్యాజిక్‌ని మళ్లీ బిగ్ స్క్రీన్ పై ఆస్వాదించే అరుదైన అవకాశం. ఇది కేవలం నాస్టాల్జియా కాదు...సినిమా ప్రేమికులకు తరతరాలుగా స్ఫూర్తినిస్తూనే ఉన్న ఒక దిగ్గజం 35 సంవత్సరాల వేడుక. ఈ నవంబర్ 21న థియేటర్లలో మెగాస్టార్ టైమ్‌లెస్ ప్రెజెన్స్‌ని మరోసారి ఆస్వాదించండి.

'ఆంధ్ర కింగ్ తాలూకా'లో ప్రేమకథ అందంగా ఉంటుంది

హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని 'ఆంధ్ర కింగ్ తాలూకా'తో అలరించబోతున్నారు. పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. హై-ఆక్టేన్ ఎనర్జీ, రొమాన్స్, అభిమానులతో కూడిన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఆన్-స్క్రీన్ సూపర్‌స్టార్ పాత్రను పోషిస్తున్నారు. వివేక్ & మెర్విన్ స్వరపరిచిన ఈ సినిమా సంగీతం ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది, నాలుగు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా మారాయి. ట్రైలర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో సినిమాపై అంచనాలని భారీగా పెంచింది. ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలోకి వస్తుంది ఈ సందర్భంగా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

కాంత సినిమాకి, మీ పర్ఫార్మెన్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.. ఎలా అనిపించింది?
చాలా ఆనందంగా అనిపించింది. ప్రేక్షకులు నటిగా నాలో ఉన్న పొటెన్షియల్ చూశారు. చాలా అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చారు. ఇది జస్ట్ బిగినింగ్ మాత్రమే.

ఆంధ్ర కింగ్ లో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?
ఆంధ్ర కింగ్ లో నేను మహాలక్ష్మి క్యారెక్టర్ లో కనిపిస్తాను. తను కాలేజ్ గోయింగ్ గర్ల్. సాగర్ తో ప్రేమలో ఉంటుంది. అంతకుమించి ఇప్పుడు ఎక్కువ క్యారెక్టర్ గురించి రివిల్ చేయకూడదు. కథలో తన క్యారెక్టర్ చాలా ఇంపార్టెంట్. మీరు సినిమా చూస్తున్నప్పుడు మీకే అర్థమవుతుంది. ఈ క్యారెక్టర్ ఆడియన్స్ గుర్తుపెట్టుకునేలా వుంటుంది.

మహేష్ ఈ కథ చెప్తున్నప్పుడు మీకు నచ్చిన ఎలిమెంట్స్ ఏమిటి?
అభిమానం అనేది డివైన్ ఎమోషన్. నేను నార్త్ నుంచి సౌత్ కొచ్చినప్పుడు ఇక్కడ అభిమానుల అభిమానం చూసిన తర్వాత ఒక స్టార్ ని ఇంత గొప్పగా ఆరాధిస్తారో ప్రేమిస్తారో ప్రత్యక్షంగా చూశాను. అది నిజంగా చాలా గొప్ప ఎమోషన్. ఎలాంటి రిలేషన్ లేకుండా పరిచయం లేకుండా ఒక వ్యక్తిని అంతలా ఎలా అభిమానిస్తారు అనిపించేది. మహేష్ ఈ కథ చెప్పిన తర్వాత ఆ ప్రశ్నకు సమాధానం దొరికింది.

ఉపేంద్ర తో మీకు కాంబినేషన్ సీన్స్ ఉన్నాయా?
ఒక కాంబినేషన్ సీన్ ఉంది. ఆయన వెరీ హంబుల్ యాక్టర్. చాలా డౌన్ టు ఎర్త్. ఆయనతో వర్క్ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

సాగర్ మహాలక్ష్మి లవ్ స్టోరీ ఎంత కొత్తగా ఉండబోతుంది?
ఇందులో ప్రేమ కథ చాలా స్వచ్ఛంగా ఉండబోతుంది. నువ్వుంటే చాలు, చిన్ని గుండెలో పాటలు మీరు చూసే ఉంటారు. ప్రేమలో ఉన్న గొప్ప ఎమోషన్ ఇందులో ఉంటుంది.

రామ్ తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?
రామ్ తో నటించడం అమేజింగ్ ఎక్స్పీరియన్స్ . వెరీ ఎనర్జిటిక్ పెర్ఫార్మర్. ఆయన ఎనర్జీ మ్యాచ్ చేశానని అనుకుంటున్నాను. లవ్ స్టోరీ, డైలాగ్స్ చాలా బ్యూటిఫుల్ గా ఉంటాయి. రామ్ చాలా పాజిటివ్ గా ఉంటారు.

ఈ సినిమా మీకు ఫేవరెట్ సాంగ్ ఏంటి?
సినిమా ఆల్బమ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పాటలన్నీ ఇష్టం. అయితే నాకు ఫేవరెట్ నువ్వుంటే చాలు.

ఇది పిరియడ్ సినిమా కదా కాస్ట్యూమ్స్ పరంగా ఎలాంటి కేర్ తీసుకున్నారు
ఇది 2000లో జరిగే కథ, డైరెక్టర్ కాస్ట్యూమ్స్, ఆర్ట్ వర్క్ అన్నిటి పరంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఇందులో మీకు చాలెంజింగ్ గా అనిపించిన సీక్వెన్స్ ఉందా?
ఇందులో ఒక ఇంపార్టెంట్ సీన్ ఉంది.డైరెక్టర్ గారు ఎక్స్ప్లెయిన్ చేశారు. నేను ఎలా అనుకుంటున్నానో చేసి చూపిస్తానని డైరెక్టర్ గారికి రిక్వెస్ట్ చేశాను. నేను చేసింది అందరికీ నచ్చింది. అంత క్రియేటివ్ స్పేస్ ఇవ్వడం నాకు చాలా ఆనందంగా అనిపించింది.

మీరు ఫ్యూచర్లో ఎలాంటి క్యారెక్టర్ చేయాలనుకుంటున్నారు?
నాకోసం ఎలాంటి కథలు రాసిపెట్టి ఉన్నాయో నాకు తెలియదు. అయితే వచ్చిన ప్రతి క్యారెక్టర్ కి 100% ఇచ్చి ఒక వెర్సటైల్ యాక్ట్రెస్ గా పేరు తెచ్చుకోవాలని ఉంది. అనుష్క గారు అరుంధతిలో చేసినటువంటి క్యారెక్టర్స్ చాలా ఇష్టం. అలాంటి పాత్రలు నాకు వస్తాయని ఆశిస్తున్నాను.

మీరు చేసిన రెండు సినిమాలకే చాలా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ వచ్చింది.. ఎలా అనిపిస్తుంది?
ఇది ఒక అదృష్టంగా భావిస్తున్నాను. అందరికీ ఇలాంటి సపోర్టు ఉండదు. అందరూ కూడా తమ అమ్మాయిగా అభిమానాన్ని చూపించారు.ఇలాంటి అభిమానం గౌరవం ప్రేమ మరింత పొందాలని కోరుకుంటున్నాను.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200